

బ్రిటిష్ పాలనపై విప్లవాగ్ని

సాయుధ పోరాటంతో గడగడలాడించిన విప్లవ వీరుడు

- ఆదివాసీలపై అకృత్యాలను అడ్డుకున్న మన్యం ధీరుడు
- గిరిజనులతో కలిసి తిరుగుబాటుకు శ్రీకారం
- నేడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి

· 8లో

ప్రైవేటుకు దీటుగా..

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపునకు తీవ్ర కృషి

- ఇంటింటికీ వెళుతున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు
- నాణ్యమైన విద్య, ప్రభుత్వ పథకాల గురించి తల్లిదండ్రులకు అవగాహన
- పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వినతి
- ఆశాజనకంగా ప్రవేశాలు
- పాఠశాలలు తెరిచే వరకు స్పెషల్ డ్రైవ్



అనకాపల్లి మండలం సంతపాలెంలో పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు విజయోత్సవ ర్యాలీ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు జిల్లా విద్యా శాఖ ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నది. కలెక్టర్ విజయకృష్ణన్ సూచనల మేరకు విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, మౌలిక సదుపాయాల గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారిలో ఒక్కరు కూడా ప్రైవేటు స్కూళ్ల బాట పట్టకుండా చూడడమే కాకుండా, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా కృషి చేస్తున్నారు.

జిల్లా విద్యా శాఖ గణాంకాల ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు సుమారు 2.2 లక్షల మంది ఉన్నారు. అయితే వీరిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 94,850 మంది మాత్రమే. మిగిలిన వారంతా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. విద్యా శాఖకు ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ, నాణ్యమైన విద్యను అందిస్తున్నప్పటికీ సగానికిపైగా విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదవడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. అత్యుత్తమ ఉపాధ్యాయులతో ఉచిత విద్యతోపాటు మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, బెల్టులు అందజేస్తున్నామని, వీటి గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పేలా కృషి చేయాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సూచించారు. దీంతోపాటు కలెక్టర్ విజయకృష్ణన్ సూచనలతో విద్యా శాఖాధికారులు, ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలను పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ప్రస్తుతం వేసవి సెలవులు అయినప్పటికీ ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల గొప్పదనం, ఈ ఏడాది ... మిగతా 8వ పేజీలో



ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలు, ప్రభుత్వ పాఠశాలల్లో బోధన తీరును వివరిస్తూ జిల్లా విద్యా శాఖాధికారులు విడుదల చేసిన కరపత్రం

టీచర్ల చొరవ అభినందనీయం



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు, విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఎంఈఓలు, ఉపాధ్యాయులు వేసవి సెలవుల్లో స్వచ్ఛందంగా పని చేయడం అభినందనీయం. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి విద్యార్హతలతో, అత్యుత్తమ ఉపాధ్యాయులతో బోధన జరుగుతుంది. డిజిటల్ బోధనతోపాటు ఉచిత భోజన పథకాన్ని అమలు చేస్తున్నాం. పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారం, బూట్లు, వగైరా సామగ్రిని ఉచితంగా ఇస్తున్నాం. అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ఎంతైనా మంచిది.

గిడ్డి అప్పారావు నాయుడు, డీఈవో

మళ్లీ లేటరైట్

నాతవరం మండలం భమిడికలొద్దిలో ఖనిజం తవ్వకాలు

- గిరిజనుడి పేరుతో లీజు, మైనింగ్ మాఫియా వ్యాపారం
- అధికారంలో ఉన్న నేతలకు కాసులు కురిపిస్తున్న లేటరైట్
- నాడు వైసీపీ ముఖ్యనేత కుమారుడి దందా
- లక్షల టన్నుల ఖనిజం అక్రమంగా తరలింపు
- కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మారిన పెత్తనం
- ఓ నేత తనయుడి హవా..
- పట్టించుకోని నియంత్రణ శాఖల అధికారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని నాతవరం మండలం భమిడికలొద్ది అటవీ ప్రాంతం నుంచి లేటరైట్ ఖనిజం అక్రమంగా తరలిపోతున్నది. మాఫియాకు కాసులు కురిపించే లేటరైట్ తవ్వకాల విషయంలో గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు నడిచిన బాటలోనే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఒక ప్రధాన పార్టీ నేతలు నడుస్తున్నారు. లేటరైట్ ఖనిజాన్ని యథేచ్ఛగా తవ్వుకుంటూ, సిమెంట్ పరిశ్రమలకు రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. వైసీపీ హయాంలో ఆ పార్టీకి చెందిన ఒక ముఖ్యనేత కుమారుడి కనుసన్నల్లో లేటరైట్ తవ్వకాలు జరగ్గా.. ఇప్పుడు కూటమిలోని ఒక పార్టీకి చెందిన ఒక ముఖ్య నాయకుడి కుమారుడు తెర వెనుక ఉండి వ్యవహారం నడిపిస్తున్నారు. దీంతో నియంత్రణ శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి అయినా చూడడంలేదు.



నాతవరం మండలం భమిడికలొద్దిలో ఎక్స్‌కవేటర్లతో తవ్వుతున్న లేటరైట్ ఖనిజం

నాతవరం మండలం సుందరకోట పంచాయతీ భమిడికలొద్ది అటవీ ప్రాంతంలో పెద్ద మొత్తంలో లేటరైట్ నిక్షేపాలు వున్నాయి. ఈ ఖనిజాన్ని సిమెంట్ ఉత్పత్తిలో ముడి సరకుగా వినియోగిస్తారు. అయితే భమిడికలొద్ది ప్రాంతంలో ఐదో షెడ్యూల్‌లో వుండడంతో ఇక్కడ 1/70 చట్టం అమల్లో వుంది. అంటే ఈ ప్రాంతంలో గిరిజనులు మినహా మరెవరూ మైనింగ్ చేయడానికి వీల్లేదు. దీంతో గత ప్రభుత్వం జర్తా లక్ష్మణరావు అనే గిరిజనుడిని తెరపైకి తీసుకువచ్చింది. ఇతని పేరుతో దరఖాస్తు చేయించి, 296.34 ఎకరాల్లో లేటరైట్ తవ్వకానేందుకు 2041వ సంవత్సరం వరకు అనుమతి ఇచ్చింది. లక్ష్మణరావు పేరు మీద లీజు అనుమతులు వున్నప్పటికీ, ఖనిజం తవ్వకాలు, రవాణా, విక్రయం అంతా నాడు అధికారంలో వున్న వైసీపీ పెద్దలే నడిపారు. నాడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఒక వైసీపీ ఎమ్మెల్యే సహాయంతో ఆ పార్టీకి చెందిన ముఖ్యనేత కుమారుడు లేటరైట్ ఖనిజాన్ని అడ్డగోలుగా తవ్వి, సిమెంట్ తయారీ కంపెనీలకు తరలించారు. రిజర్వు అటవీ ప్రాంతంలో ఖనిజం తవ్వడమే కాకుండా, దీనిని రవాణా చేయడానికి అడవిలో నుంచి రోడ్డు వేశారు. దీంతో ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు ఆందోళనలు నిర్వహించి, జర్తా లక్ష్మణరావు లీజును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ హరిత ట్రైబ్యునల్‌కు ఫిర్యాదులు కూడా చేశారు. దీంతో లేటరైట్ తవ్వకాలకు తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి.

ప్రభుత్వం మారినా ఆగని తవ్వకాలు

గత ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో లేటరైట్ మాఫియా ఆగడాలకు చెక్ పడుతుందని గిరిజనులు, ప్రజా సంఘాల నాయకులు భావించారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితుల్లో ఎటువంటి మార్పులేదు. గతంలో వైసీపీ నాయకులు లేటరైట్ తవ్వకాలు చేపడుతున్నారంటూ అప్పట్లో ప్రతిపక్షంలో వున్న కొంతమంది కూటమి నాయకులు ఆందోళనలు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత అదే నాయకులు లేటరైట్ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. జిల్లాకు చెందిన ఒక ముఖ్యనేత కుమారుడు రంగంలోకి దిగి మళ్లీ జర్తా లక్ష్మణరావుకు చెందిన లీజు ఆధారంగా భమిడికలొద్దిలో లేటరైట్ తవ్వకాలు సాగిస్తున్నారు. గత రెండు వారాలుగా రేయింబవళ్లు ఎక్స్‌కవేటర్లతో ఖనిజాన్ని తవ్వి, టిప్పర్లతో తరలిస్తున్నారు. రోజూ 80 నుంచి 100 వరకు టిప్పర్లు, లారీల్లో లేటరైట్‌ను పక్కనే వున్న కాకినాడ జిల్లా రౌతులపూడి మండలంలో ఏర్పాటు చేసిన యార్డుకు తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి రావికంపాడు రైల్వే స్టేషన్‌కు తరలించి, అక్కడి నుంచి సిమెంట్ కంపెనీలకు పంపుతున్నారు.

ఇటీవల సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు నేతృత్వంలో సీపీఎం, స్థానిక గిరిజన సంఘాల నేతలు భమిడికలొద్ది లేటరైట్ మైనింగ్ ప్రాంతాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. గిరిజనుడైన జర్తా లక్ష్మణరావు పేరుతో లీజు పొందిన మైనింగ్ మాఫియా, గిరిజన చట్టాలను ఉల్లంఘిస్తూ అక్రమంగా మైనింగ్ జరుపుతున్నట్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.



భమిడికలొద్ది నుంచి రౌతులపూడికి టిప్పర్‌లో తరలిస్తున్న ఖనిజం

ఇంక్యుబేషన్ కేంద్రం పనుల్లో కదలిక

- యంత్రాలు, ఇతర వనరుల కోసం రూ.2.5 కోట్లతో టెండర్లు
- బెల్లం, చిరుధాన్యాలు, పనస ఉత్పత్తుల ప్రాసెసింగ్



ఆర్ఏఆర్ఎస్‌లో ఇంక్యుబేషన్ కేంద్రం

అనకాపల్లి అగ్రికల్చర్, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆచార్య ఎన్జీ రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో చెరకు, చిరుధాన్యాలు, పనస ఉత్పత్తుల ప్రాసెసింగ్ కోసం ఏర్పాటైన కామన్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో (అంకుర కేంద్రం) ఎట్టకేలకు కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. 2.5 కోట్ల రూపాయలతో యంత్రాలు, ఇతర వనరులు సమకూర్చుకునేందుకు టెండర్ల ప్రక్రియ మొదలయ్యింది. కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ 'ఒక జిల్లా- ఒక ఉత్పత్తి' కార్యక్రమం కింద ఈ కేంద్రం ఏర్పాటుకు రెండేళ్ల కిందట రూ.3.5 కోట్లు మంజూరు చేసింది. వి ఇందులో కోటి రూపాయల వ్యయంతో ఇంక్యుబేషన్ కేంద్ర భవనం నిర్మించారు. ఇక్కడ బెల్లం విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్, ఇంకా చిరు ధాన్యాలు, పనస ఉత్పత్తుల ప్రాసెసింగ్ నిర్వహిస్తారు. బెల్లం ప్రాసెసింగ్ లైన్‌కు రూ.1.37 కోట్లు, చిరుధాన్యాల ప్రాసెసింగ్ ఏర్పాట్లకు రూ.66 లక్షలు, పనస ఉత్పత్తులకు రూ.25 లక్షలు ఖర్చు చేస్తారు. ఆహార పరీక్ష ప్రయోగశాలను రూ.25 లక్షలతో ఏర్పాటు చేస్తారు. ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యవస్థాపకులకు వాణిజ్యపరంగా ఉపయోగపడేలా సహకారం అందిస్తారు. రైతులు, వ్యవస్థాపకులకు ఆహార ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లపై శిక్షణ ఇస్తారు. నామమాత్రపు రుసుముతో ఇక్కడ అన్ని విధాలా ప్రోత్సాహం అందుతుందని పంటకోత అనంతరం సాంకేతిక ఇంజనీరింగ్ విభాగం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు, డాక్టర్ శ్రీదేవి తెలిపారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి పలు నిర్ణయాలు తీసుకుంది. టమాటా, మామిడి ఫుడ్ ప్రాసెసింగ్‌పై శిక్షణ, మార్కెటింగ్ కార్యక్రమాలను రూపొందిస్తున్నది.

ఆర్ఈసీఎస్ ఉద్యోగుల జీతాల పెంపునకు

రూ.3 కోట్ల డీల్!?

సంస్థపై నెలకు రూ.50 లక్షల భారం

- బకాయిలు చెల్లిస్తే అదనంగా మరో రూ.20 కోట్లు
- సహకార శాఖ కమిషనర్ ఆమోదం లేకుండా పీఆర్సీ వర్తింపజేయాలని నిర్ణయం





(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సరఫరా సంస్థ (ఆర్ఈసీఎస్) ఉద్యోగులకు పే రివిజన్ కమిషన్-2022 జీతాలు వర్తింపజేయడానికి మూడు కోట్ల రూపాయలకు డీల్ కుదిరిందని విశ్వసనీయ సమాచారం. ఇందులో స్థానిక నాయకులు వారి వాటా తీసుకొని, మిగిలిన మొత్తం జిల్లా, ఈపీడీసీఎల్ అధికారులకు ఇచ్చేలా ఒప్పందం జరిగిందని చెబుతున్నారు. ఈ నిర్ణయం అమలు చేయడం వల్ల అనకాపల్లి ఆర్ఈసీఎస్‌పై నెలకు రూ.50 లక్షల భారం పడుతుంది. 2022 నుంచి పెరిగిన జీతాల బకాయిలు ఇస్తే మరో రూ.20 కోట్లు ఖజానా నుంచి చెల్లించాల్సి ఉంటుంది. ఉద్యోగులు తమకు పెరిగిన ఆరు నెలల జీతం వదులుకోవడానికి సిద్ధపడి ఈ ఒప్పందం చేసుకున్నారని తెలిసింది.

ఆర్ఈసీఎస్‌లో ఉద్యోగుల నియామకానికి ఎటువంటి నియమ నిబంధనలు పాటించడం లేదు. రాజకీయంగా ఏ పార్టీ అధికారంలో ఉంటే వారికి చెందిన వారిని ఉద్యోగులుగా తీసుకుంటున్నారు. ఈపీడీసీఎల్ విద్యుత్‌ను యూనిట్ రూ.1.50 చొప్పున సరఫరా చేస్తోంది. దానిని సొసైటీ ఐదు రూపాయల చొప్పున అమ్మి ఆ లాభాలను సొసైటీ ఖాతాలో వేసి, జీతాలు, ఖర్చులు కింద చూపించి లాభపడుతోంది. ఇలా కొన్ని దశాబ్దాలుగా నడుస్తోంది. వీరు నిధులను దుర్వినియోగం చేస్తున్నారని గుర్తించి ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి కఠిన చర్యలు చేపట్టింది. ప్రభుత్వం కూడా ఈ సొసైటీల కొనసాగింపునకు రెన్యువల్ చేయకుండా ఆపేసింది. ఈ నేపథ్యంలో అనకాపల్లి సొసైటీని ఈపీడీసీఎల్‌కు అప్పగించారు.

సొసైటీలో శాశ్వత ఉద్యోగులు 120 మంది, కాంట్రాక్టు పే వర్కర్లు (తాత్కాలికం) 492 మంది ఉన్నారు. అవసరాలకు మించి ఉద్యోగులను నియమించారని విద్యుత్ నియంత్రణ మండలి ఇంతకు ముందే గుర్తించింది. ఇప్పుడు ఈపీడీసీఎల్ అధికారులు 120 మందికే పీఆర్సీ అమలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే పీఆర్సీ వర్తిస్తుంది. సొసైటీకి వర్తించదు. ఆ ఉద్యోగులను ఈపీడీసీఎల్ విలీనం కూడా ... మిగతా 8వ పేజీలో



నూతన హాకీ మైదానాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత

క్రీడలతో ఆరోగ్యం, ఆత్మస్థైర్యం

- హోం మంత్రి అనిత
- నక్కపల్లిలో నూతన హాకీ మైదానం ప్రారంభం

నక్కపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): పిల్లలు తమకు నచ్చిన క్రీడల్లో రాణించేందుకు బాల్యం నుంచే నిరంతరం సాధన చేయాలని, ఇందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. నక్కపల్లిలో రూ.1.6 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆస్ట్రో టర్ఫ్ మినీ హాకీ గ్రౌండ్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, క్రీడలతో పిల్లలకు మంచి ఆరోగ్యంతోపాటు, మానసిక స్థైర్యం కలుగుతుందని చెప్పారు. రాష్ట్రం నాలుగుచోట్ల ఆధునిక హాకీ మైదానాలు నిర్మించగా, అందులో ఇది ఒకటని తెలిపారు. హాకీలో స్థానిక యువతకు శిక్షణ ఇస్తున్న బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపకుడు బలిరెడ్డి సూరిబాబును ఆమె అభినందించారు. హాకీ మైదానం వద్ద విద్యుత్తు, తాగునీటి సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. పాయకరావుపేటలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, స్టేడియం నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి అనిత చెప్పారు. ఈ కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నాడు అధ్వానంగా.. నేడు అద్దంలా..

చోడవరం- పీఎస్ పేట మధ్య రూ.2.5 కోట్లతో సీసీ రోడ్డు

గుంతలు లేని రహదారిపై సాఫీగా ప్రయాణం

చోడవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): మూడు మండలాల ప్రజలు రాకపోకలు సాగించి చోడవరంలోని కొత్తూరు జంక్షన్ నుంచి పీఎస్ పేట వరకు ఆర్అండ్‌బీ రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఇటీవల వరకు నరకప్రయాణంగా ఉన్న ఈ రోడ్డును రెండున్నర కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశారు. అంతకు ముందు ముందు ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రహదారి పెద్ద పెద్ద గోతులతో దారుణంగా వుండేది. వర్షం కురిస్తే గోతుల్లో నీరు చేరి చెరువులను ... మిగతా 8వ పేజీలో



కొత్తూరు జంక్షన్ సమీపంలో..



హైస్కూల్ సమీపంలో...





రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు

అనకాపల్లి అగ్రికల్చర్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాగల ఐదు రోజుల్లో జిల్లాలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు తెలిపారు. మంగళవారం ఆర్ఏఆర్ఎస్‌లో వాతావరణ ఆధారిత వ్యవసాయంపై సమావేశం జరిగింది. వర్ష సూచన వున్నందున కోత దశలో ఉన్న నువ్వు పంటను కోయడం వాయిదా వేసుకోవాలని సూచించారు. పక్వానికి వచ్చిన అరటి గెలలు, మామిడి, బొప్పాయి కాయలను వెంటనే కోసి మార్కెట్‌కు తరలించాలని సూచించారు. కాగా వేసవి వర్షాలను ఉపయోగించుకుని పొలంలో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవాలని ఆయన చెప్పారు. ఇక బీర, కాకర, ఆనప, వంటి కాయగూరల పంటలను రసం పీల్చు పురుగులు ఆశించి వైరస్ తెగుళ్లను వ్యాప్తి చేయవచ్చునని, వీటి నివారణ కోసం లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల డైమిథోయేట్ మందును కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కె.వి.రమణమూర్తి, డాక్టర్ వి.గౌరి, డాక్టర్ బి.భవానీ, డాక్టర్ పి.వి.పద్మావతి, డాక్టర్ అలివేలు తదితరులు పాల్గొన్నారు.

కలగా మిగిలిన పంపానదిపై వంతెన


రత్నయ్యమ్మపేట సమీపంలో పంపానదిపై ఎస్‌టీఎల్ హేచరీ వారు నిర్మించిన జెట్టీ కూలిన దృశ్యం

బ్రిడ్జి లేక కుమారపురం, రత్నయ్యమ్మపేట గ్రామస్థులకు ఇక్కట్లు

ఏళ్ల తరబడి కోరుతున్న రెండు గ్రామాల ప్రజలు

పాయకరావుపేట రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారపురం శివారు రత్నయ్యమ్మపేట సమీపంలో పంపానదిపై వంతెన లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుమారపురం, రత్నయ్యమ్మపేట గ్రామాలకు చెందిన రైతులు పొలాలకు వెళ్లాలన్నా.. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లాలన్నా పంపానది దాటి వెళ్లాలి. నదిపై వంతెన నిర్మించాలని ఈ రెండు గ్రామాల ప్రజలు చాలా సంవత్సరాలుగా నాయకులు, అధికారులను కోరుతున్నా ఫలితం లేకపోతోంది. ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయని, ఎన్నికలు ముగిసిన తరువాత వంతెన గురించి నాయకులు కనీసం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రత్నయ్యమ్మపేటలో సుమారు వంద మత్స్యకార కుటుంబాలు చేపల వేటను జీవనాధారంగా జీవిస్తున్నాయి. సముద్రంలోకి వేటకు వెళ్లాలంటే పంపానదిలో దిగి వెళ్లాల్సిందే. అదేవిధంగా రైతుల జీడి తోటలు, పొలాలు పంపానది ఆవల వైపున ఉన్నందున ప్రతి రోజూ పంపానది దాటి వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో ఎస్‌టీఎల్ హేచరీ వారు నిర్మించిన జెట్టీపై నుంచి గ్రామస్థులు రాకపోకలు సాగించేవారు. అయితే ఎనిమిదేళ్ల క్రితం జెట్టీ కూలిపోవడంతో నదిని దాటడానికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన అనేక మంది పాల్మన్‌పేటలో ఉన్న హేచరీలలో పనిచేస్తున్నారు. వీరు హేచరీకి వెళ్లడానికి చుట్టూ తిరిగి వెళుతున్నారు. వర్షాలు కురిసేటప్పుడు, సముద్రం నీరు వెనక్కి వచ్చే సమయాలలో నదిలో నీరు ఎక్కువగా ఉంటుందని, అటువంటి రోజులలో నదిని దాటడానికి అష్టకష్టాలు పడుతున్నామని గ్రామానికి చెందిన జనార్దన్‌రెడ్డి, ఎరిపల్లి జగన్నాథం, కామరాజు, కోడ సింహాచలం, జగ్గ, తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం నుంచి పాల్మన్‌పేట, అద్దరిపేట, కాకినాడ తదితర ప్రాంతాలకు వెళ్లడానికి ఈ మార్గం దగ్గర కావడంతో గ్రామస్థులు ఎక్కువగా ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. నాలుగేళ్ల క్రితం మత్స్యకారులందరూ కలిసి తమ సొంత నిధులతో పంపానదిపై తాటి కలపతో నడిచి వెళ్లడానికి వీలుగా వంతెన నిర్మించుకున్నారు. అయితే అది కూడా ప్రస్తుతం శిథిలమైంది. గతంలో 2018లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు అప్పటి ఎమ్మెల్యే వంగలపూడి అనిత పంపానదిపై నడిచి వెళ్లేందుకు వీలుగా రూ.9లక్షలతో వంతెన నిర్మించడానికి నిధులు కేటాయించి, శంకుస్థాపన చేశారు. తరువాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బ్రిడ్జి ఊసే ఎత్తలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాలిబాట వంతెనకు నిధులు మంజూరు చేస్తారని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.


పంపానదిపై గ్రామస్థులు వేసుకున్న తాటి కర్రల వంతెన దుస్థితి

నడిచి వెళ్లేందుకు వంతెన నిర్మించాలి



చొక్కా కామరాజు, రత్నయ్యమ్మపేట

పంపానదిపై వంతెన లేక వేటకు, పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నాం. గతంలో రెండు సార్లు వంతెన నిర్మిస్తామని నాయకులు, అధికారులు కొలతలు వేసి హడావిడి చేశారు. వంతెన నిర్మిస్తారని ఆనందపడ్డాం. కానీ ఇంతవరకు ఎటువంటి చర్యలు లేవు. కనీసం నడిచి వెళ్లడానికి వంతెన నిర్మించాలి.

డ్రైనేజీల్లో పూడిక తొలగించాలి


ఈదటంలో డ్రైనేజీలో పేరుకుపోయిన పూడిక

పాయకరావుపేట రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదటం గ్రామంలో డ్రైనేజీల్లో పూడికను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. డ్రైనేజీలో పూడిక పెరిగిపోయి మురికినీరు పారకపోవడంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు పెరిగిపోయి రోగాల బారిన పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీల్లో పూడికను తొలగించాలని పంచాయతీ అధికారులకు, సర్పంచ్‌కు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీల్లో పూడికను తొలగించాలని కోరుతున్నారు.

సాయిబాబా సన్నిధిలో తల్లులకు పాదపూజ


తిమ్మరాజుపేటలో తల్లులకు పాదాభివందనం చేస్తున్న పిల్లలు

మునగపాక, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో తిమ్మరాజుపేటలో సత్యసాయిబాబా మందిరంలో తల్లులకు పిల్లలు పాదాభివందనం చేశారు. సత్యసాయిబాబా మాతృమూర్తి ఈశ్వరాంబ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ధర్మ ప్రచారకులు సాయి సందేశాన్ని వివరించారు. సృష్టిలో తల్లి ప్రేమను మించింది. కార్యక్రమంలో సాయి భజన మండలి సమితి కన్వీనర్ నరిసా శివ, తల్లులు, పిల్లలు, సాయి సేవకులు పాల్గొన్నారు.

రెండు వరి రకాలను విడుదల చేసిన ఐసీఏఆర్

బీసీటీ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజా కుర్రా


శైలజా కుర్రా

రాంబిల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): భారత వ్యవసాయ ఎ ం డ లి (ఐసీఏఆర్) ప్రప్రథమంగా జినోమ్ ఎడిటెడ్ (జన్యువృద్ధి) రెండు వరి రకాలను విడుదల చేసిందని హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజా కుర్రా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీ భారత పరిశోధనా సంస్థ అభివృద్ధి పరచిన పూసా డీఎస్‌టీ-1, హైదరాబాదు భారత పరిశోధన సంస్థ రూపొందించిన డీఆర్‌ఆర్‌దాన్-100 (కమల) రకాలను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఈనెల 5న జాతికి అంకితం చేశారన్నారు. ఆర్‌ఆర్ దాన్-100 కమల రకాన్ని ఎన్‌డీఎన్ 1 జినోమ్ ఎడిటెడ్ సాంకేతికతను సాంబమసూరి వరి రకంతో వాడి అభివృద్ధి పరిచారన్నారు. పంట కాలము 130 రోజులన్నారు. దిగుబడి హెక్టారుకు 5.37 టన్నులు , గరిష్ఠ దిగుబడి 9 టన్నులు వస్తుందన్నారు. మధ్యస్థంగా వర్షాభావ పరిస్థితులను తట్టుకుంటుందన్నారు. ఈ రకం బీపీటీ 5204 రకం కన్నా మూడు తక్కువ నీటి తడులతో పండుతుందన్నారు. ఈ రకం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బంగా రాష్ట్రాల్లో సాగుకు అనుకూలంగా ఉంటుందన్నారు. పూసా డీఎస్‌టీ-1 రకాన్ని ఎన్‌డీఎస్ 1 క్రిస్పర్ 9 జినోమ్ ఎడిటెడ్ సాంకేతికను, ఎంటీయూ 1010 రకంతో అభివృద్ధి పరిచారన్నారు.

చౌడు నేలల్లోను, వర్షాభావ పరిస్థితుల్లోను సాగుకు అనుకూలమన్నారు. కోస్తా చౌడు నేలలో 2,493 కిలోలు హెక్టార్‌కు, క్షారనేలల్లో 3,731 కిలోలు హెక్టార్‌కు దిగుబడి వస్తుందని, తక్కువ నీటితో పండుతుందన్నారు. ఈ రెండు రకాలు తక్కువ నీటితడితో తక్కువ కాలంలో పండుతాయని, 20 శాతం తక్కువ హరితగృహ వాయువులను విడుదల చేస్తాయని బీసీటీ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త శైలజా కుర్రా ఆ ప్రకటనలో తెలిపారు.

మనిషికి విద్య మూడో నేత్రం

» రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత » టెన్త్‌లో 101 మంది ప్రతిభావంతులకు రూ.5 వేలు చొప్పున పంపిణీ


టెన్త్ ప్రతిభావంతులను అభినందిస్తున్న హోం మంత్రి అనిత


డీసీసీబీ చైర్మన్ కోన తాతారావును సత్కరించిన హోంమంత్రి అనిత

నక్కపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): మనిషికి విద్య మూడో నేత్రం లాంటిదని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగపర్చుకుని ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. మంగళవారం స్థానిక క్యాంప్ కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలో టెన్త్‌లో అత్యుత్తమ ఫలితాలు కనబర్చిన విద్యార్థుల అభినందన సభను నిర్వహించారు. ముందుగా ఒక్కో విద్యార్థికి రూ.5వేలు చొప్పున 101 మందికి ఆమె నగదు ప్రోత్సాహకాలను, జ్ఞాపికలను బహూకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మెరికల్లాంటి విద్యార్థులున్నారని టెన్త్ ఫలితాలు నిరూపించాయన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా హైస్కూళ్లల్లో చదువుకుంటున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం సంతోషకరమన్నారు. ఉపాధ్యాయులు కన్పించే దేవుళ్లని, పాఠశాలలు దేవాలయాలన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో విద్యావ్యవస్థల్లో అనేక సంస్కరణలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు, ఉపాధ్యాయులు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

హోం మంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్

డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన కోన తాతారావు మంగళవారం హోం మంత్రి వంగలపూడి అనితను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ప్రతినిధిగా వున్న కోన తాతారావును ప్రభుత్వం ఇటీవల డీసీసీబీ చైర్మన్‌గా నియమించింది. ఈమేరకు ఆయన హోం మంత్రి అనితను కలిశారు. ఆయన్ని హోం మంత్రి దుశ్శాలువతో సత్కరించారు. ఆయన వెంట ఏపీ సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ వున్నారు.

కేజీబీవీల్లో విద్యా పరిమళాలు : అనిత

కోటవురట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేజీబీవీ పాఠశాలలో విద్యాపరిమళాలు వెదజల్లుతున్నాయని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం సాయంత్రం కోటవురట్ల కస్తూర్బా విద్యాలయంలో రూ.1.68 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విద్యారంగంలో అనేక విప్లవాత్మకమైన వార్పులు తీసుకువస్తున్నారన్నారు. కొత్త డీఎస్సీ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం పాఠశాలలో మౌలిక సదుపాయలు కల్పించేందుకు ఆయన కృషి చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం రోజుల్లో ఆడపిల్లలు చదవించడానికి ముందురాని తల్లిదండ్రులు ఈ పాఠశాల్లో పిల్లలను చదవించేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. నియోజకవర్గ టాపర్‌గా నిలిచిన సుర్ల జాహ్నవిని ఈ సందర్భంగా మంత్రి అనిత ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం రాజుపేటలో పరదేశమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లాసర్వశిక్షాభియాన్ కో-ఆర్డినేటర్ జయప్రకాష్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, తహసీల్దార్ తిరుమలరావు, ఎంఈవోలు రామారావు, జోషి, స్థానిక సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు సూర్యారావు, రాజుపేట సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ పాల్గొన్నారు.


కోటవురట్ల కేజీబీవీలో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన హోంమంత్రి వంగలపూడి అనిత

లాలంకోడూరులో మినీ పార్కును ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు


లాలంకోడూరులో మినీ పార్కును ధ్వంసం చేసిన దృశ్యం

రాంబిల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాలంకోడూరులో మినీ పార్కును గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ధ్వంసం చేశారని పంచాయతీ కార్యదర్శి కె.సంతోష్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 112లో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ పార్కును పంచాయతీ నిర్వహిస్తుందన్నారు. ఈనెల 5న తాను విధులు ముగించుకొని సాయంత్రం వెళ్లే సమయంలో పార్కు బాగానే ఉందని, మంగళవారం విధులకు వచ్చి ఈ పార్కును చూసినపుడు ధ్వంసం చేసి ఉందన్నారు. ఈ విషయాన్ని గ్రామంలో వారిని అడుగ్గా.. గుర్తుతెలియని వ్యక్తులు పార్కును ధ్వంసం చేశారని తెలిపారన్నారు. పార్కును ధ్వంసం చేసిన వారిని గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి


రాంబిల్లి పీహెచ్‌సీ వైద్యునికి సమ్మె వినతిపత్రాన్ని అందజేస్తున్న దేముడునాయుడు, ఆశాలు

రాంబిల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన రాంబిల్లి, దిమిలి పీహెచ్‌సీల్లో ఆశావర్కర్లతో కలిసి వైద్యులకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తీసుకువస్తున్న లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్‌లను అమలు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని సమ్మె జరుగుతుందన్నారు. ఈ సమ్మెలో ఆశా కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని దేముడునాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో రెండు పీహెచ్‌సీల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు

» ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ వంతెన పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ అన్నారు. మంగళవారం మండల కాంప్లెక్స్‌లో గల డిజిటల్ లైబ్రరీలో కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్ని అన్ని రంగాల్లో ఆర్థికంగా స్థిరపడాలనే ఉద్దేశంలో కూటమి ప్రభుత్వం మహిళాభ్యుదయానికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. 90 రోజుల పాటు శిక్షణ అనంతరం కుట్టు మిషన్‌ను ఉచితంగా ఇస్తామన్నారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. అంతకు ముందు అచ్యుతాపురం జంక్షన్‌లో జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణపు పనులను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌తో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, జనపరెడ్డి శ్రీనివాస రావు, బైలపూడి శ్రీరామ దాసు, జనపరెడ్డి నర్సింగరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నాణ్యతా పాటిస్తూ త్వరితగతిన నిర్మాణం జరగాలి

మునగపాక, మే 6 (ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశించారు. అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు మార్గం విస్తరణలో భాగంగా మునగపాక పెద్ద మదుం వద్ద పాత వంతెనకు ఆనుకొని నిర్మిస్తున్న బ్రిడ్జీ పనులను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే విజయకుమార్ గ్రౌండ్‌లెవెల్‌లో జరుగుతున్న కాంక్రీట్ పని వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాడిన మెటీరియల్ గురించి ఆరా తీశారు. వర్షాకాలం వస్తే నిర్మాణ పనులకు ఇబ్బందికరం అవుతుందని, దానిని దృష్టిలో పెట్టుకొని పనులు వేగవంతం చేయాలన్నారు. ఇంజనీర్లు పర్యవేక్షణలో పనులు జరగాలన్నారు. ఆమె వెంట పలువురు అధికారులు ఉన్నారు. కాగా, మండలంలోని ఒంపోలులో పైడిమాంబ అమ్మవారిని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దర్శించుకున్నారు. ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కృష్ణంపాలెం గ్రామాన్ని తరలించండి

» ఆర్డీవోకు గ్రామస్థుల వినతి


ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కృష్ణంపాలెం మాజీ సర్పంచ్ ప్రసాద్, గ్రామస్థులు

రాంబిల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి):కాలుష్య కోరల్లో కొట్టుమిట్టాడుతున్న కృష్ణంపాలెం పంచాయతీలోని మిగిలిన గ్రామాన్ని తరలించాలని గ్రామ మాజీ సర్పంచ్ కళిరెడ్డి ప్రసాద్ పలువురు గ్రామస్థులు కోరారు. మంగళవారం గ్రామానికి వచ్చిన అనకాపల్లి ఆర్డీఓ షేక్ ఆయేషాకు వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో ఏపీఐఐసీ 80శాతం భూసేకరణ చేసిందని, ఆ కుటుంబాలకు ప్రభుత్వం ప్యాకేజీని ఇవ్వడం జరిగిందన్నారు. మిగతా 20 శాతం కుటుంబాలు వారు గ్రామంలోనే ఉంటున్నారన్నారు. గ్రామాన్ని ఆనుకొని ఉన్న ఎస్ఈజడ్‌లోని కంపెనీల నుంచి వెలువడే కాలుష్యం గ్రామం మీదకు వస్తుందన్నారు. గాలి, నీరు కలుషితమై పలు రకాల చర్మవ్యాధులు, అనారోగ్య సమస్యలకు గురవుతూ ఆసుపత్రుల పాలవుతున్నామన్నారు. మిగుల గ్రామాన్ని తరలించి ఆదుకోవాలని ఆర్డీఓ షేక్ ఆయేషాబేగమ్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

నేడు 19 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, మే (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 19 ప్రాంతాల్లో ఈనెల 7వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె. రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలమంచిలి టౌన్-1 ఫీడర్, 11కేవీ ఎలమంచిలి టౌన్ 11 ఫీడర్, ఎలమంచిలి టౌన్ 11కేవీ ఫీడర్‌కు సంబంధించి కొత్త ఫీడర్ లైన్ నిర్వహణ పనులు నిమిత్తం మిలటరీ కాలనీ, కొత్తపేట, యానాద్రి కాలువ, స్టేషన్ రోడ్డు, మెయిన్‌రోడ్, ద్వారకానగర్, నెహ్రూనగర్, గాంధీనగర్, తులసీనగర్, ఎన్టీఆర్ కాలనీ, జగనన్న కాలనీ, ఫైర్‌ఆఫీస్ కాలనీ, ధర్మవరం, జలాల్‌వీధి, ఎర్రవరం, కొత్తఎర్రవరం, లైన్‌కొత్తూరు, సోమన్నపాలెంలో కరెంటు నిలివేస్తున్నట్టు ఆయన తెలిపారు.

కూటమి ప్రభుత్వ హయాంలోనే యానాద్రి కాలువకు మోక్షం


యానాద్రి కాలువ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పట్టణ ప్రజలకు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని యానాద్రి కాలువకు మోక్షం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. పట్టణంలో వీఎంఆర్డీఏ నిధులు రూ.2.75కోట్లతో చేపట్టనున్న యానాద్రి కాలువ అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తున్నదన్నారు. అలాగే ఎలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రైల్వే స్టేషన్ వరకు వీఎంఆర్‌డీఏ నిధులు రూ.30 లక్షలతో వేసిన వీధి లైట్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, మానం వెంకట ప్రవీణ్‌గోపాల్, మున్సిపల్ అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

పరదేశమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు

ఎలమంచిలి మున్సిపాలిటీలోని ఎర్రవరం-2లో కొలువైన పరదేశమ్మ పండుగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారిని స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పార్టీ నేతలతో కలిసి అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సత్కరించారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు, ఆలయ కమిటీ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

బాలల రక్షణ సమష్టి బాధ్యత

» సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి

మునగపాక, మే 6 (ఆంధ్రజ్యోతి): బాలల రక్షణకు ప్రతి ఒక్కరూ సమిష్టి బాధ్యత వహించాలని సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి (తాతాజీ) పిలుపునిచ్చారు. స్థానిక సచివాలయంలో మంగళవారం బాలల సంరక్షణ గ్రామ కమిటీ ఏర్పాటు అయ్యింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న ఆకృత్యాలను దృష్టిలో పెట్టుకొని పిల్లలను అజాగ్రత్తగా విడవకూడదన్నారు. జిల్లా సంరక్షణ కమిటీ సభ్యురాలు రమ్య మాట్లాడుతూ 11 మందితో కూడిన గ్రామ కమిటీ వేశామని, సమస్యలను కమిటీ దృష్టికి తీసుకు రావాలన్నారు.

భూ రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి


వమ్మవరంలో రీ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు

ఎస్.రాయవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరంలో నిర్వహిస్తున్న భూ రీసర్వే పనులను మంగళవారం తహసీల్దార్ జె.రమేష్‌బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రీ సర్వేను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్వే బృందాన్ని రీ సర్వేకు చెందిన పలు విషయాలను అడిగి తెలుసుకొని, వారికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

98 డీఎస్సీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

▸▸ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వినతి



అయ్యన్నపాత్రుడుకు వినతిపత్రం ఇస్తున్న 98 డీఎస్సీ టీచర్లు

నర్సీపట్నం, మే 6 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లు కోరారు. ఈ మేరకు మంగళవారం క్యాంప్ కార్యాలయంలో 98 డీఎస్సీ టీచర్లు స్పీకర్‌కి వినతిపత్రం అందజేశారు. 1998 డీఎస్సీలో ఎంపికైనా 25 ఏళ్లు ఉద్యోగాలకు నోచుకోలేదన్నారు. 2023 ఏప్రిల్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 4,373 మంది 98 డీఎస్సీ అభ్యర్థులను ఎంటీఎస్ టీచర్లుగా రూ.32,670 స్వల్ప వేతనంతో నియమకాలు చేపట్టారన్నారు. ఎంటీఎస్ టీచర్లకు విద్యా సంవత్సరంలో జీతాలు 11 నెలలకు మాత్రమే ఇస్తున్నారన్నారు. కౌన్సెలింగ్‌లో చాలా మందిని సుదూర ప్రాంతాలకు, ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారని తెలిపారు. రిటైర్మెంట్ వయస్సు 60 సంవత్సరాలు కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 500 మంది ఉద్యోగ విరమణ చేయాల్సి వస్తుందని తెలిపారు. 12 నెలలు జీతాలు ఇప్పించి, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలు చేయాలని కోరారు. ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలని కోరారు.

మాజీఎంపీ పాలకొండ రాయుడు మృతికి స్పీకర్ సంతాపం

నర్సీపట్నం, మే 6 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మాజీ ఎంపీ పాలకొండరాయుడు మృతికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు సంతాపాన్ని తెలిపారు. పాలకొండరాయుడు అనారోగ్యంతో బెంగళూరులో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. టీడీపీ సీనియర్ నాయకుడు పాలకొండ రాముడు రాయచోటి నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యే, రాజంపేట నుంచి ఎంపీగా చేశారని గుర్తు చేశారు. ఆయన మృతి తెలుగుదేశం పార్టీకి, రాయచోటి ప్రజలకు తీరని లోటని అయ్యన్నపాత్రుడు అన్నారు.

కోటమ్మతల్లి ఘటాల ఊరేగింపు



నాతవరంలో అమ్మవారి ఘటాలను ప్రారంభిస్తున్న గ్రామపెద్దలు

నాతవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రెండేళ్లకొకసారి జరిగే గ్రామ దేవత కోటమ్మతల్లి ఘటాల పండగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం ఘటాల ఊరేగింపును సందడిగా నిర్వహించారు. వేదపండితులు జూన్ 3వ తేదీన కోటమ్మతల్లి పండగను జరిపేందుకు ముహూర్తం పెట్టారు. మే 6వ తేదీన అమ్మవారి ఘటాలను ఊరేగించారు. జూన్ మూడో తేదీ వరకు అమ్మవారి ఘటాలను ప్రతి రోజూ ఊరేగిస్తారు. జూన్ 3న వీధికొక స్టేజ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. ఎడ్లు, గుర్రాల పందేలు నిర్వహించనున్నారు.

మూన్నాళ్ల ముచ్చటగా బస్టాండ్ పనులు

▸▸ పూడ్చిన మూడు నెలలకే మళ్లీ ఏర్పడిన గోతులు ▸▸ పనుల నాణ్యతపై ప్రయాణికుల మండిపాటు



మాకవరపాలెం బస్టాండ్‌లో జనవరిలో పనులు చేస్తున్న దృశ్యం(ఫైల్)



మళ్లీ గోతులు పడడంతో బస్టాండ్‌లో నీరు నిలిచిన దృశ్యం

మాకవరపాలెం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న బస్టాండ్ పనులు మూన్నాళ్ల ముచ్చటగా నిలిచాయి. చిన్నపాటి వర్షానికే గోతుల్లో నీరు చేరి బస్టాండ్ ఆవరణ అంతా బురదగా మారుతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనవరి నెలలో అధికారులు బస్టాండ్‌లో గోతుల పూడ్చివేత చేపట్టారు. అయితే పనులు చేసిన మూడు నెలలకే మళ్లీ గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు అవాక్కవుతున్నారు. మూడు నెలలకే మళ్లీ గోతులు ఏర్పడడంపై వారు మండిపడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బస్టాండ్ ఆవరణ బురదగా మారడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

బస్సు ఎక్కాలంటే బురద నీటిలో నుంచి వెళ్లాల్సి వస్తున్నదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలో గోతులకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అయ్యప్పస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠకు హోమం

నర్సీపట్నం, మే 6(ఆంధ్రజోతి): అయ్యప్పస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠలో భాగంగా తొలిరోజు మంగళవారం యాగశాలలో హోమం నిర్వహించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియాన్ని ఆనుకొని ఉన్న అయ్యప్ప ఆలయంలో స్వామివారి విగ్రహ పునః ప్రతిష్ఠా కార్యక్రమాలు మంగళవారం నుంచి గురువారం వరకు జరుగుతున్నాయి. మంగళవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు యాగశాలలో విఘ్నేశ్వర పూజ, పుణ్యవచనం, మండప ఆరాధన, పూజలు నిర్వహించారు. శైవ ఆగమన సంప్రదాయం ప్రకారం తూర్పుగోదావరి జిల్లా పెదపర్తికి చెందిన యలమంచు కృష్ణమూర్తి శివాచార్యులు ఆధ్వర్యంలో యలమంచు ప్రసాద్ పండితులు అగ్ని ప్రతిష్ఠ, హోమం, కలశారాధన, ధ్వజారోహన పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



యాగశాలలో హారతి పడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు


ఎన్టీఆర్ పుట్టిన రోజును ఆత్మ గౌరవ దినోత్సవంగా నిర్వహించాలి

ఎన్టీఆర్ పుట్టిన రోజుని తెలుగువారి ఆత్మ గౌరవ దినోత్సవంగా నిర్వహించాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీరామ్ స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కోరారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో స్పీకర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. తెలుగువారి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడని, తెలుగు భాష, సంస్కృతికి ఎన్టీఆర్ పెద్ద పీట వేశారన్నారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి ఎన్టీఆర్ పుట్టిన రోజుని తెలుగువారి ఆత్మ గౌరవ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పీకర్ సానుకూలంగా స్పందించారని బీఎస్‌రామ్ తెలిపారు.

వ్యాపారుల కుమ్మక్కుతో తగ్గిన జీడిపిక్కల ధర

▸▸ జీడిమామిడి రైతుల ఆరోపణ

▸▸ మొన్నటి వరకు 80 కిలోల బస్తా రూ.12 వేలు ప్రస్తుతం రూ.10,500లకు కొనుగోలు



నాతవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు కుమ్మక్కు అయి జీడిపిక్కల ధర తగ్గించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొన్నటి వరకు 80 కిలోల జీడిపిక్కల బస్తా ధర రూ.12 వేలకు కొనుగోలు చేసేవారు. అయితే సోమవారం నుంచి వ్యాపారులు 80 కిలోల జీడిపిక్కల బస్తాను రూ.10,500లకు కొనుగోలు చేయడంతో జీడిమామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలే ఏడు వేల ఎకరాలలో జీడిమామిడి పూత మంచుకు, టీదోమతో మాడిమాసైపోవడంతో తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నామన్నారు. ఇప్పుడు ధర తగ్గించడంతో మరింత నష్టపోతాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఎలక్ట్రానిక్ కాటాలతో వ్యాపారులు మోసం చేస్తున్నారని వారు ఆరోపించారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు ఎలక్ట్రానిక్ కాటాలను తనిఖీ చేయాలని వారు కోరుతున్నారు. ఎలక్ట్రానిక్ కాటాతో జీడిపిక్కలు తూకం వేసేటప్పుడు కిలో దగ్గర 50 గ్రాములు మేనేజ్ చేస్తున్నారని, దీంతో 80 కిలోల బస్తాకు నాలుగు కిలోల వరకు నష్టపోతున్నామని రైతులు తెలిపారు. నిరక్షరాస్యులు కావడంతో ఎలక్ట్రానిక్ కాటాల మోసాలను గుర్తించలేక పోతున్నామని వారంటు న్నారు. తూనిక లు, కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహిస్తే మోసాలు జరగకుండా ఉంటాయని జీడిమామిడి రైతులు అంటున్నారు.

చెరువుల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి

▸▸ జాయింట్ కలెక్టర్ జాహ్నవి



శంకాడ చెరువును పరిశీలిస్తున్న జేసీ జాహ్నవి

గొలుగొండ, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెరువులు, సాగునీటి వనరుల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి తెలిపారు. మంగళవారం మండలంలోని గుండుపాల రెవెన్యూలో శంకాడ చెరువు ఆక్రమణలను ఆమె పరిశీలించారు. అనంతరం చెరువు రికారులను తనిఖీ చేశారు. స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావును అడిగి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కొత్తఎల్లవరం చెరువు ఆక్రమణలను పరిశీలించారు. పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పథకంలో చేపట్టిన పనులను ఆక్రమణదారుడు ట్రాక్టర్‌తో దుక్కు దున్నడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం ఉపాధి పనుల్లో చేపట్టిన నిధులు ఆక్రమణదారుడు నుంచి రికవరీ చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో చెరువుల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ భూములు, చెరువులు ఆక్రమణకు గురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆమె వెంట నర్సీపట్నం ఆర్డీవో వీవీ. రమణ, తహసీల్దార్ శ్రీనివాసరావు, డీటీ ఛైన్లు ఉన్నారు.

'ప్రభుత్వ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ నాగమణి

గొలుగొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మత్స్యకారులు సద్వినియోగపర్చుకోవాలని మత్స్యకార అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ నాగమణి తెలిపారు. మంగళవారం జోగంపేట జంక్షన్‌లో ఏర్పాటైన మత్స్యకారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మత్స్యకారులకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఫిష్ ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్‌లో సభ్యులు చేరితే కేంద్రం పలు సంక్షేమ పథకాలు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది చిట్టినాయుడు, రావణాపల్లి రిజర్వాయర్ చైర్మన్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

850 క్వింటాళ్ల వరి విత్తనాలకు ప్రతిపాదనలు

మాకవరపాలెం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజనకు 850 క్వింటాలు వరి విత్తనాలకు ప్రతిపాదనలు పంపామని మండల వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. సాంబ మసూరి, 1064, 1061, ఆర్‌జేఎల్, శ్రీకాకుళం సన్నాలతోపాటు మరికొన్ని రకాల వంటి వరి విత్తనాలు అందుబాటులో ఉంటాయన్నారు. మరో వారం రోజుల్లో వరి విత్తనాలు మండల సచివాలయాలకు వస్తాయని ఆయన తెలిపారు.

భీమవరంలో భూ ఆక్రమణ

బుచ్చెయ్యపేట మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో భీమవరంలో అమ్మకం చేసిన 30.74 ఎకరాల డీ పట్టా భూమిని రద్దు చేసినట్టు స్థానిక తహసీల్దార్ ఎం.లక్ష్మి తెలిపారు. అయితే, భూమిని కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. వివరాలివి.. ఈ డీ పట్టా భూమి కొనుగోలు చేసిన కడియాల రాజేశ్వరరావు అనే వ్యక్తి దీనిపై హక్కులు వదులుకోంటూ గత నెలలో కలెక్టర్‌కు సంబంధిత డాక్యుమెంట్లు సమర్పించిన విషయం తెలిసిందే. దీనిపై తహసీల్దార్ విచారణ చేపట్టి 223, 224, 226, 227, 228లల్లో డీ పట్టాలను రద్దు చేశారు. ఇది జరిగిన తర్వాత స్థానిక నాయకుల ప్రోత్సాహంతో పాత పట్టాదారులు రాజేశ్వరరావు ప్రభుత్వానికి అప్పగించిన భూమిలో అక్రమణల పర్వం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈ భూమిని పేదలకు అందించాలని పలువురు కోరుతున్నారు.



రాజేశ్వరరావు ప్రభుత్వానికి అప్పగించిన భూమిలో ఆక్రమణ

వైభవంగా ఆంజనేయస్వామి తీర్థం

చీడికాడ, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్జున గిరి గ్రామంలో అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్లపరుగుపోటీలు నిర్వహించారు. 18 జతల ఎడ్లు పాల్గొన్నాయి. వీటిలో పరవాడ నాయుడుబాబు అర్జునగిరి ఎడ్లకు ప్రథమస్థానం, శ్రీపెద పైడితల్లమ్మ ఎల్‌వీపాలెం ద్వితీయ స్థానం, బండారు చరణ్‌హర్ష కెఎల్‌బీ పట్నం ఎద్దులకు తృతీయ, మరో ఆరు బహుమతులను వివిధ గ్రామాల ఎడ్లు గెలుపొందాయి. ఈ ఎడ్ల రైతులకు నగదు బహుమతి సర్పంచ్ కోడూరు సత్యవతి, ఎంపీటీసీ పైల ముత్యాలనాయుడు, ఆంజనేయకమిటీ కోడూరు పెదబాబు, డోకల అక్కునాయుడు, కురచా ఈశ్వరరావు, కురచా రమణ, రెడ్డి నానాజీ, రెడ్డి రామారావు, ఎ.మహేశ్ తదితరులు అందించారు. సాయంత్రం మహిళలకు కోలాట పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.



మైదానంలో పరుగు తీస్తున్న ఎద్దులు

టెన్నిస్ క్రీడాకారిణికి అభినందన

దేవరాపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి పారా టేబుల్ టెన్నిస్‌క్రీడాకారిణి గుల్లిపల్లి తేజశ్వనిని ఎమ్మెల్యే బండారుసత్యనారాయణమూర్తి మంగళవారం ఘనంగా సత్కరించారు. సికింద్రాబాద్‌లోని నవోదయ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న తేజశ్విని గతనెల 17నుంచి 19 వరకు గుజరాత్‌లో జరిగిన పారా టేబుల్ టెన్నిస్ నేషనల్ పోటీల్లో తన సత్తా చాటింది. ఉమెన్ సింగిల్ క్లాస్ 10 విభాగంలో తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఈ బాలిక ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లితండ్రులు అర్జునరావు, వరలక్ష్మి, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు , టీడీపీ నాయకులు సూర్యనారాయణ, చెరకాన సూర్యనారాయణ పాల్గొన్నారు.



టెన్నిస్ క్రీడాకారిణి సత్కరిస్తున్న ఎమ్మెల్యే

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం

▸▸ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు



సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట మే 6 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని, గతంలో వివిధ కారణాలతో నిలిచిన నిర్మాణాలకు అదనపు సాయం అందిస్తామని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు అన్నారు. స్థానిక మండల కార్యాలయంలో మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ దాకవరపు నాగేశ్వరి దేవి అధ్యక్షత నిర్వహించారు. బత్తుల తాతయ్యబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీ, ఎస్‌సిలకు రూ.50. వేలు, ఎస్టీలకు రూ. 75వేలు ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల కోసం రూ. 3,219 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. ఎంఈవో- 2 కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 10 నోడల్ స్కూళ్ల కింద విజయరామరాజుపేట, వడ్డాది- 2, పోలేపల్లి, రాజాం, మళ్ళాం, లైపురం, ఆర్. భీమవరం, పెదమదిన, దిబ్బిడి పాఠశాలలు ఎంపికైనట్టు చెప్పారు. సీతయ్యపేట సర్పంచ్ వజ్రపు ఇందిరాశ్రీను మాట్లాడుతు జగనన్న కాలనీ నిర్మాణం రోడ్డు సమస్యతో ఆగిపోయిందన్నారు.

మండల సమావేశంలో సమస్యలపై నిలదీత

రోడ్డు కోసం రైతులను ఒప్పించే బాధ్యత తీసుకుంటానని, ఇళ్ల నిర్మాణానికి సహకరించాలని కోరారు. పెదపూడి సర్పంచ్ వర కృష్ణ మాట్లాడుతు పంగిడి గ్రామంలో సుజల స్రవంతి కోసం సర్వే చేస్తున్నారని, దీనిపై కనీసం తను సమాచారంలేదన్నారు. పునరావాస ప్యాకేజీ గాని గ్రామ సభ కూడా నిర్వహించకుండా సర్వే చేపట్టడం తగదని మండిపడ్డారు. గున్నెంపూడి, వడ్డాది -2 ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ తమ గ్రామాల్లో తాగునీటి బోర్లు ప్రారంభోత్సవానికి తమకు ఆహ్వానం లేదన్నారు. జలజీవన్ మిషన్ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యుత్ ఏఈ సమావేశాలకు గైర్హాజరవుతుండడంపై మండి పడ్డారు. ఈ సమావేశంలో తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపిఆర్‌డి విజయలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీల ఎంపిక

మాడుగుల రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. తాటిపర్తి కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సలుగు లక్ష్మి, ఓంధ్రు కృష్ణ, అల్లంగి శంకరరావు, వీరవిల్లిలో పాశిల నాగేశ్వరరావు, రామన్నదొర, భీమేశ్, సాగరంలో కరక నాగేశ్వరరావు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేశ్, నందారపు సన్యాశిరావు, వడ్డి రాజ్‌కుమార్, బుద్దాల రమణ తదితరులు పాల్గొన్నారు.

'ఎంఎల్‌హెచ్‌పీలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు'

రోలుగుంట, మే 6(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల పరిధిలో నియమితులైన ఎంఎల్‌హెచ్‌పీలతో ప్రజలకు ఏమీ ఒరిగిందేమీ లేదని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఏఎన్‌ఎంలు, ఫీల్డ్ సూపర్‌వైజర్లు అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓలు నూకరాజు, రమాకాంతారావు, హెచ్‌వీ సన్యాసమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

బీజేపీ నేతపై భూ కబ్జా ఫిర్యాదు

కె.కోటపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రొంగలి, పైలా కుటుంబాలకు తాత ముత్తాతల నుంచి ఉమ్మడిగా ఉన్న 69 సెంట్ల భూమిని బీజేపీ అధ్యక్షురాలు పైలా అమ్మాజీ తన భర్త ఈశ్వరరావు పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని స్థానిక కో ఆపరేటివ్ బ్యాంకులో రుణం పొందినట్టు పైడమ్మ చెరువు ఆయకట్టుదారుల సంఘం అధ్యక్షుడు పైలా గంగునాయుడు, రొంగలి చిరంజీవి, రొంగలి అబ్బద్ధం, పైలా గోపీ ఆరోపించారు. ఈ విషయమై అ మ్మాజీని రెండు కుటుంబాల పెద్దలు ప్రశ్నించగా దాడులకు దిగుతున్నట్టు ఆరోపించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ రమేశ్‌బాబును వారు కలిసి ఉమ్మడి ఈ ఆస్తిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.



తహసీల్దార్‌కు వినతి ఇస్తున్న దృశ్యం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా కృషి చేయాలి: ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అధికశాతం విద్యార్థులు చేరేలా ఉపాధ్యాయులు, అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లలపాలెంలో కస్తూర్బా బాలికల విద్యాలయంలో రూ.1.64 కోట్ల సర్వశిక్ష అభియాన్ నిధులతో అదనపు తరగతుల భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ నూతన విద్యావిధానం ద్వారా బోధనలో మార్పులు తీసుకువస్తున్నారన్నారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల సత్తా చూపించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రెసిడెంట్ రొంగలి మహేశ్, జనసేన మండల అధ్యక్షుడు బాలిబోయిన సంతోశ్, నాయకులు కన్నూరు సూర్యనారాయణ, బత్తి వెంకటరమణ, దాడి ఎరుకునాయుడు, బొడ్డు అక్కునాయుడు, సబ్బవరపు రామునాయుడు, కశిరెడ్డి అప్పలనాయుడు, ప్రిన్సిపాల్ బి. చిన్నమ్మలు, ఉపాధ్యాయులున్నారు.



కస్తూర్బాలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి: మండలంలోని బేతపూడి కె.జీబీవీ బాలికల ఆశ్రమ కళాశాల అదనపు గదుల నిర్మాణానికి రూ.164.02 లక్షలు సమగ్ర శిక్ష నిధులతో శిలా ఫలకం ఆవిష్కరించారు. సమగ్ర శిక్ష ఈఈ నరసింహరావు, కేజీబీవీ ప్రత్యేక అధికారి భువన మాధురి, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితునికి చేయూత

చోడవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని శ్రీరాంపట్నంనకు చెం దిన గోల్కొండ సన్యాసిరావుకు ఆ గ్రామానికి చెందిన యవకులు గంగాధర్ తదితరులు సుమారుగా రూ.13వేలు విరాళాలుగా సేకరించి అతని కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆ యువకులను అభి నందించారు.



సన్యాసిరావుకు ఆర్థిక సాయం అందిస్తు యువకులు

త్రుటిలో తప్పిన ప్రమాదం

చోడవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న తహసీల్దార్ కార్యాలయం ప్రవేశ మార్గంలో మంగళవారం మధ్యాహ్నం కొబ్బరిచెట్టు కూలి గూనూరు సురేశ్‌కు చెందిన దుకాణంపై పడింది. అయితే, షాప్‌లో ఉన్నవ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోనే సబ్ జైలు, సబ్‌ట్రెజరీ కార్యాలయాలతో పాటు పంచాయతీ కార్యాలయం ఉంది. పడిన కొబ్బరిచెట్టు ధాటికి తహసీల్దార్ కార్యాలయం ప్రవేశమార్గం బోర్డుతో పాటు, గోడ దెబ్బతింది. ఈ చెట్టును స్థానికులు తొలగించారు.



తహసీల్దార్ కార్యాలయం ఆనుకుని ఉన్న దుకాణంపై కూలిన కొబ్బరి చెట్టు

ఉపాధి కూలీల ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్‌లు



కొమిరలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకన్నబాబు

రావికమతం, మే 6, (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు తమ ఇళ్ల పై కప్పులకు సోలార్ రూఫ్‌టాప్‌లను అమర్చుకోవాలని ఎంపీడీవో కె. వెంకన్నబాబు సూచించారు. మండలంలో కొమిర గ్రామంలో ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సౌర విద్యుత్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వమే ఎస్సీ, ఎస్టీలకు సోలార్ రూఫ్‌టాప్ యూనిట్ శత శాతం ఉచితంగా ఏర్పాటు చేస్తుందన్నారు. ఓసీ, బీసీ ఇతర వర్గాలకు 50 శాతం రాయితీపై కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో కొమిర సర్పంచ్ గొర్లె రవికుమార్, టీడీపీ నాయకులు గొర్లె నూకునాయుడు, కరణం ఈశ్వరావు పాల్గొన్నారు.

కంద మొక్కకు పువ్వు

రావికమతం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోటకు చెందిన దుర్గాదేవి ఆలయ ప్రధాన అర్చకుడు వేప రామకృష్ణ శర్మ ఇంటి పెరట్లోని కంద మొక్కకు పువ్వు పూసింది. కంద మొక్కకు పిలకలు వచ్చి 15 నుంచి 20 అడుగుల ఎత్తు వరకు ఏపుగా ఎదుగుతుంది. మొక్క వేరు భాగంలో చిన్న చిన్న దుంపలు లభ్యమవుతాయి. కానీ, రామకృష్ణశర్మ పెరట్లో ఎప్పుడో సుమారు పదేళ్ల క్రితం వేసిన దుంపకు ఇప్పుడు అడుగున్నరకు పైగా పువ్వు పూయటంతో అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఎప్పుడూ పువ్వు రాలేదని, ఏడాది మాత్రమే వచ్చిందని ఆయన తెలిపారు. దీనిపై ఉద్యానవన అధికారి మాట్లాడుతూ కందకు అరుదుగా ఇలా పువ్వు వస్తుందన్నారు.



వికసించిన కంద మొక్కకు పువ్వు

రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రామీణ డాక్ సేవక్‌గా శ్రీనివాసరావు ఎంపిక


అవార్డు అందుకుంటున్న పైలా శ్రీనివాసరావు

చింతపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి):స్థానిక తపాలా కార్యాలయంలో పనిచేస్తున్న పైలా శ్రీనివాసరావు రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రామీణ డాక్ సేవక్ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ ఆఫ్ జనరల్ జయప్రకాశ్ ఈ పురస్కారాన్ని శ్రీనివాసరావుకి అందజేశారు. గ్రామీణ స్థాయిలో తపాలాశాఖ సేవలను ప్రజలకు చేరువ, వివిధ పథకాల్లో ప్రజలను చేర్పించడంతో ఆయన అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. దీంతో రాష్ట్ర స్థాయిలో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ పోస్టుమాస్టర్ ఆఫ్ జనరల్ మూర్తి, డీవోపీఎల్‌పి వైవీ పలాసిరావు, ఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై జరిమానాలు


తనిఖీలు చేపడుతున్న పంచాయతీ సిబ్బంది

పాడేరురూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు అమ్మకాలు చేస్తున్న వ్యాపారులకు జరిమానా విధించినట్టు ఈవోపీఆర్‌డీ ఆర్‌వీఎస్ రమేశ్ తెలిపారు. రెండు నెలలుగా ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నా ఇంకా వాటిని వినియోగిస్తుండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులు సంయుక్తంగా మంగళవారం పాడేరులోని పలు షాపులపై ఆకస్మిక తనిఖీ చేపట్టారు. చేపట్టి సింగిల్ యూస్ ప్లాస్టిక్ అమ్మకాలు, వినియోగిస్తున్న షాపుల యజమానుల వద్ద నుంచి వాటిని స్వాధీనం చేసుకున్నారు.రూ. 100 నుంచి రూ. 500 వరకు జరిమానా విధించారు. మరోసారి పట్టుబడితే రూ. 500 నుంచి రూ. 1000 వరకు జరిమానా విధిస్తామని ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వీఆర్‌వోలు మర్రి చెట్టు రామునాయుడు, జె.వెంకటలక్ష్మి, జి.రవికుమార్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

వినియోగదారులతో మర్యాదగా మెలగాలి: ఎస్‌ఐ


కించుమండలో వర్తకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

డుంబ్రిగుడ,మే6(ఆంధ్రజ్యోతి): వినియోగదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని స్థానిక ఎస్‌ఐ పాపినాయుడు వ్యాపారులకు సూచించారు. మండలంలోని కించుమండలో వర్తక సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతూ దుకాణాల్లో చోరీలు జరగకుండా నిఘా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వినియోగదారులతో స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధారాలమ్మ హుండీ ఆదాయం రూ.4.39 లక్షలు


హుండీ లెక్కిస్తున్న దృశ్యం

సీలేరు, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ధారాలమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.4.39,313 వచ్చినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు నెలల హుండీ ఆదాయాన్ని కమిటీ సభ్యులు మంగళవారం లెక్కించారు. గతంతో పోల్చుకుంటే ఈ ఆదాయం పెరిగిదన్నారు. భక్తుల కోసం ఆలయంలో ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు పోతురాజు గోవిందరాజు, గడుతూరి చిన్నారావు, పోతురాజు కృష్ణ, నారాయణరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు


కారులో తనిఖీ చేస్తున్న పోలీసులు

పెదబయలు, మే 6 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు రోడ్డు భద్రత నిబంధనలను విధిగా పాటించాలని స్థానిక ఎస్‌ఐ కొల్లి రమణ సూచించారు. మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన చోదకుడికి ధ్రువపత్రాలతోపాటు లైసెన్సు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపినా, అతి వేగంతో ప్రయాణించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలతో పట్టుబడితే వారి తల్లిదండ్రులు పోలీసు స్టేషన్‌కు రావాల్సి ఉంటుందని చెప్పారు. ప్రైవేటు ఆటో, జీపు వంటి వాహనాలలో పరిమితి మించి ప్రయాణికులను ఎక్కిస్తే జరిమానాలతోపాటు వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. త్వరలో జాతర్లు జరగనున్న నేపథ్యంలో ప్రమాదాలు చోటుచేసుకోకుండా వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రైనీ ఎస్‌ఐ నేతాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫలించని కష్టం.. పంటల సాగులో నష్టం

- గిరిపుత్రుల దయనీయ స్థితి
- టమాటా, మొక్కజొన్నకు దక్కని గిట్టుబాటు ధర

డుంబ్రిగుడ, మే 6 (ఆంధ్రజ్యోతి): అధిక ఆదాయం ఆశించి గిరి రైతులు వాణిజ్య పంటలైన కాఫీ, మిరియాలు, పసుపు, అల్లంతోపాటు క్యాబేజీ, క్యారెట్ తదితర పలు రకాల కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. అయితే, మార్కెట్‌లో కూరగాయల పంటలకు సరైన గిట్టుబాటు ధరలేక ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం కూరగాయల విత్తనాలు, ఇతర వాటిని రాయితీపై అందించకున్నా రైతులు స్వచ్ఛందంగా పెట్టుబడులు పెట్టి


పొలాల్లో టమాటా సేకరిస్తున్న గిరిజన మహిళలు


విక్రయానికి సిద్ధంగా మొక్కజొన్న

టమాటా, మొక్కజొన్న పంటలను సాగుచేస్తున్నారు. అయితే ఈ ఏడాది ఈ పంటలకు గిట్టుబాటుధరలభించలేదు. దీంతో పండించిన రైతులు కనీసం పెట్టుబడి రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.మూడు వారాల కిందట టమాటా కేటు రూ. 700 ఉండగా ప్రస్తుతం రూ.300కు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మొక్కజొన్న బస్తా రూ. 400 ధర ఉండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబమంతా నెలల తరబడి కష్టబడి సాగుచేసినా పెట్టుబడులు రావడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.దీంతోపాటు గ్రామాల్లో నుంచి వారపు సంతలకు వస్తున్నా లగేజీ డబ్బులు కూడా ఆర్థికంగా కుదేలవుతున్నారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ : ఐసీడీఎస్ పీడీ

పాడేరురూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్. సూర్యలక్ష్మి సూచించారు. పాడేరు గ్రామ సచివాలయం - 1లో కిశోర వికాస వేసవి శిబిరంలో భాగంగా మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆమె కిశోర బాలికలకు వివిధ ఆరోగ్య సూత్రాలు, పాటించాల్సిన పద్ధతులను వివరించారు. గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టేందుకు ఐసీడీఎస్ సిబ్బంది గ్రామ స్థాయిలో ప్రజలతో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ శిబిరంలో 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల లోపు ఆడపిల్లలకు తల్లి దండ్రుల సమక్షంలో చిన్నారుల అభివృద్ధి, సంరక్షణ, సాధికారిత, పోషణ, విద్య, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు, ఆర్థిక వృత్తి విద్యలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు. పిల్లలు డ్రాప్‌అవుట్ లేకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని పీడీ ఈసందర్భంగా చూచించారు.. ఈ కార్యక్రమంలో సీడీపీవో పి.ఝాన్సీరాణి, మహిళా పోలీసులు, సూపర్‌వైజర్లు, బాలికల తల్లులు పాల్గొన్నారు.


వేసవి శిబిరంలో మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి

బాల్య వివాహాలను నియంత్రించాలి: ఎంపీడీవో

చింతపల్లి: బాల్యవివాహాలను నియంత్రించాలని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పెదబరడ గ్రామ పంచాయతీ కేంద్రంలో కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కిశోర బాలికలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కిశోర బాలికల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వారిలో కలిగే మార్పులపై సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. పోక్సో చట్టంపై వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే ఐసీడీఎస్, మహిళా కానిస్టేబుల్‌ని సంప్రదించాలన్నారు. అపరిచిత పరిచయాలకు దూరంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, సోషల్ మీడియా జోలికి వెళ్లరాదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సమిడి గోపాల్, సీడీపీవో జీవీ రమణ, ఏసీడీపీవో ఎం. రామలక్ష్మి, మహిళా కానిస్టేబుల్ మద్దెల సౌజన్య, పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం: కిడారి


జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

పాడేరు, మే 6(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతానికి సంబంధించిన సమస్యలనుపరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్టు జీసీసీ కిడారి శ్రావణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లా ఇన్ ఛార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రధానంగా జీవో 3కు ప్రత్యామ్నాయంగా గిరిజనులకు లబ్ధిచేకూరేలా మరో జీవోను తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి ఆ సమస్యకు పరిష్కారం చూపుతామని సంధ్యారాణి పేర్కొనడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. అలాగే గిరిజన ప్రాంత టీచర్ నియామకాల్లో ఎస్టీలకు అన్యాయం జరగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇవ్వడం సంతోషకరమని శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు.

టీడీపీ కొమ్మంగి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా లక్ష్మణరావు


ఎన్నికైన కొమ్మంగి గ్రామకమిటీ

చింతపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొమ్మంగి పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వంతల లక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు తెలిపారు. మంగళవారం కొమ్మంగిలో టీడీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా అధ్యక్షుడితోపాటూ ఉపాధ్యక్షుడు ముర్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా చల్లంగి సురేశ్ బాబు, కోశాధికారిగా వంతల రాము, కార్యదర్శులుగా రాజు, కొండబాబు, గబులంగి సత్తిబాబు, ఎం. సత్తిబాబు, లింగేశ్, రమేశ్ ఎన్నికైనట్టు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు రీమల ఆనందరావు, కేశ్వరారావు, లక్ష్మణరావు, కాశింవల్లి, మంగులు, కిముడు అప్పారావు, మామిడి రాజబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

కాకరపాడు ఐటీడీఏ కాలనీలో తాగునీటి కష్టాలకు తెర

- రూ.22 లక్షలతో తాగునీటి పథకం నిర్మాణం

కొయ్యూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిపాలెం పంచాయతీ కాకరపాడు ఐటీడీఏ కాలనీలో ఎట్టకేలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. ప్రభుత్వం రూ. 22 లక్షలు మంజూరు చేయటంతో కాలనీలో 20 వేల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం గల ట్యాంకుతో పాటు పైపులైన్ నిర్మాణాలు పూర్తయ్యాయి. సుమారు 150 జనాభా కలిగిన కాలనీలో ప్ర జ ల దాహార్తి తీర్చేందుకు బోరు ఏర్పాటు చేశారు. ఇది గత ప్రభుత్వ హయాంలోనే మరమ్మతుకు లోనైంది. నాటి నుంచి ఈ కాలనీ వాసులు కిలో


ఐటీడీఏ కాలనీలో తుదిశలో తాగునీటి పథకం

మీటరున్నర దూరంలోని శింగవరం గ్రామం నుంచి తాగునీటిని తెచ్చుకునేవా రు. వాడుక నీటి కోసం సమీప కొండవాగు గెడ్డ ప్రవాహాన్ని ఆశ్రయించారు. ఈ విషయమై గత ప్రభుత్వంలో పాలకులకు, అధికారులకు పలుమార్లు వినతులు ఇచ్చినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. అధికారంలోకి కూటమి ప్రభుత్వం రావటంతో సమస్యను స్థానిక తెలుగుదేశం పార్టీ నేతల దృష్టికి కాలనీ వాసులు తీసుకువెళ్ళారు.వారు పాలకుల దృష్టిలో ఉంచ టమే తడవుగా తాగునీటి పథకం నిర్మాణానికి నిధులు కేటాయించారు.

సమస్య లేకుండా ముందుగా బోరు ఏర్పాటుచేసిన దానికి మోటారు అమర్చి గ్రామంలో కుళాయిలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటి ద్వారా నీరందిస్తూ, ట్యాంకు నిర్మాణాలు పూర్తి చేశారు. దీంతో దశాబ్దాల తరబడి తాగు నీటి కష్టాలు తీరటంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.


మత్స్యమాడుగులమ్మ ఘటాల ఊరేగింపులో భక్తులు


ఉత్సవంలో కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన

వైభవంగా మత్స్యమాడుగులమ్మ అనుపోత్సవం

జి.మాడుగుల, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మత్స్యమాడుగులమ్మ అనుపోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. రామాలయం వీధిలో శతకం పట్టు నుంచి మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి భక్తులతో పాటు అమ్మవారి జన్మస్థలమైన కొండపై ఘటలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రామాలయం నుంచి పుర వీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వేషధారణలతో కళాకారులు అలరించారు. ఈ ఉత్సవాలు పురస్కరించుకుని నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన సొలభం పంచాయతీ ఎస్.పెదబయలు జట్టుకు నిర్వాహకులు నగదు బహుమతి అందజేశారు. ఈ జాతరలో స్థానిక పోలీసులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకటరమేశ్‌నాయుడు, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు ఎం.బాలరాజు, ఎంవీ వెంకటగంగరాజు, ఎం.మత్స్యరాజు, అధ్యక్షులు ఎం.రామారాజు, ప్రధాన కార్యదర్శి జి.రెడ్డిబాబు, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేటలో మోదకొండమ్మ తల్లి పండగ

హుకుంపేట; మండల కేంద్రంలోని మోదకొండమ్మ తల్లి పండగ మంగళవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు సంతకం పట్టు వద్ద ఘటాల పాదాలకు భక్తులు పూజలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఈ వేడుకలో పులి వేషాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు అనిల్,


హుకుంపేటలో ఘటాలతోత భక్తుల ఊరేగింపు

పూర్ణిమ్మ, కాసులమ్మ, గోవింద్, రామకృష్ణ, వెంకట్ తదితరులు ఉన్నారు.

మినుములూరులో ముగిసిన ఉత్సవాలు

పాడేరురూరల్: మండలంలోని మినుములూరులో గత మూడు రోజులు నిర్వహించిన మోదకొండమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దల సమక్షంలో సతకం పట్టు వద్ద భక్తి శ్రద్ధలతో పూజలను చేపట్టారు. ఘటాలను గ్రామంలో ఊరేగించి అక్కడ నుంచి పాడేరు ఘాట్‌లోని అమ్మవారి పాదాల వద్దకు తీసుకువచ్చి కొలువుదీర్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన తీన్‌మార్ బ్యాండ్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లంకెల చిట్టమ్మ, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏవోబీలో పోలీసుల గాలింపు

- వాహన తనిఖీలు
- మావోయిస్టులపై అప్రమత్తం
- పల్లెల్లో భయం


ముంచంగిపుట్టులో వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

ముంచంగిపుట్టు, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర- ఒడిశా సరిహద్దు (ఏవోబీ)లో పోలీసులు అప్రమత్తమయ్యారు. అడుగడుగునా సీఆర్‌పీఎఫ్, స్పెషల్‌పార్టీ పోలీసు బలగాలు, ఒడిశాకు చెందిన బీఎస్‌ఎఫ్, ఎస్‌వోజీ పోలీసులు మోహరించారు. ముమ్మర వాహన తనిఖీలతో పాటు సరిహద్దు గ్రామాల మీదుగా జల్లెడపడుతున్నాయి. ఇటీవల అల్లూరి జిల్లా కాకులమామిడి, కంటవరం అటవీ ప్రాంతంలో రెండుసార్లు మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు జరిగిన విషయం తెలిసిందే. అలాగే,సరిహద్దు గ్రామాల్లో మావోయిస్టులు తలదాచుకున్నట్టు పోలీసు నిఘా వర్గాలు సైతం అనుమానించడంతోఇరురాష్ట్రాల పోలీసులు అప్రమత్తమైనట్టు తెలుస్తోంది. మంగళవారం స్థానిక ఎస్‌ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ జంక్షన్ వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహన తనిఖీలు చేపట్టారు. మారుమూల గ్రామాలకు వెళ్లే వాహనాలను, వచ్చే వాహనాలను, ఆర్టీసీ బస్సులను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనుమానితులను ప్రశ్నించి, వివరాలు సేకరించి విడిచి పెట్టారు. ఒడిశాకు చెందిన పోలీసు బలగాలు మాచ్‌ఖండ్, ఒనకఢిల్లీ, పాడువ, జోలాపుట్టు గ్రామాలతోపాటు సరిహద్దు గ్రామాల మీదుగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. దీంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని సరిహద్దు గ్రామాల్లో గిరిజనులు భయాందోళన ఉంటున్నారు.

మారుమూల గ్రామాలకు వెళ్లొద్దు: ప్రజా ప్రతినిధులకు నోటీసులు

పోలీసుల అనుమతి లేకుండా మారుమూల గ్రామాలకు వెళ్లరాదని ఆదేశిస్తూ పోలీసులు ప్రజా ప్రతినిధులకు నోటీసులు జారీ చేశారు. గ్రామాల్లో మావోస్టులు సంచరిస్తున్నారని, ఉనికి కోసం ప్రజాప్రతినిధులపై దాడులకు దిగే అవకాశం ఉందని పోలీసు ఇంటెలిజెన్సీ భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో నోటీసులు జారీ చేసినట్టు తెలుస్తోంది. మావోయిస్టు హిట్ లిస్టులో ఉన్న నేతలతోపాటు ప్రజా ప్రతినిధులకు నోటీసులు జారీ చేశారు. జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల అనంతరం మావోయిస్టు సభ్యులు గ్రూపులుగా ఏజెన్సీ ప్రాంతం మొత్తం విస్తరించి, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రజా ప్రతినిధులు మారుమూల గ్రామాలకు వెళ్లరాదని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని సూచించారు.

టీడీపీలోకి వైసీపీ ప్రజా ప్రతినిధులు, నేతలు


టూరిజం డైరెక్టర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన సర్పంచ్ నాగరాజు, వైసీపీ నాయకులు

గూడెంకొత్తవీధి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరుతున్నారు. రెండు నెలల క్రితం వైసీపీకి చెందిన ఉప సర్పంచ్ సప్పగెడ్డ ఆనంద్, మరో ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు టీడీపీలో చేరారు. మంగళవారం ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు రమేశ్ నాయుడు ఆధ్వర్యంలో జర్రెల పంచాయతీ వైసీపీ మద్దతు సర్పంచ్ వీరోజు నాగరాజు, మాజీ గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు సురకత్తి సంజీవరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రీమల గోపాలరావు, వార్డు సభ్యులతోపాటు 100మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా రమేశ్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసీపీ ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు టీడీపీలో చేరుతున్నారన్నారు. పాడేరు నియోజక వర్గంలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అత్యధిక స్థానాలను సొంతం చేసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముక్కలి మహేశ్, గొలుసింగి సత్యనారాయణ, కొర్రు రామ్మూర్తి, సన్యాసిరావు, బాలయ్య, శోభ శ్రీను, తెల్లన్నదొర, లక్ష్మణరావు, దేవుడుబాబు పాల్గొన్నారు.

పాడేరులో 38.9 డిగ్రీల ఉష్ణోగ్రత

పాడేరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో వర్షాలు కురుస్తున్నప్పటికీ ఎండల ప్రభావం తగ్గడం లేదు. ఉదయం పొగమంచుతో కాస్తా చల్లదనంగా, సాయంత్రం వర్షం కురుస్తున్నా మిలిగిన సమయంలో వేడి తీవ్ర ప్రభావం చూపుతున్నది. ముఖ్యంగా పగటి వేళల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. దీంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏజెన్సీలో మంగళవారం జిల్లా కేంద్రం పాడేరులో 38.9 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా కొయ్యూరులో 35.9, పెదబయలులో 34.4, హుకుంపేటలో 33.5, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడలో 33.2, అరకులోయలో 32.1, అనంతగిరిలో 31.9, చింతపల్లిలో 31.6, జీకేవీధిలో 31.2, జి.మాడుగులలో 30.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

యోగా పోటీలు

డుంబ్రిగుడ, మే 6 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా స్థానిక జిల్లా శాఖా గ్రథాలయంలో మంగళవారం చిన్నారులకు యోగా పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయ అధికారిణి సునీ త మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యంతో పాటు మనస్సు ప్రశాంతగా ఉంటుంద్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కె. సుబ్బారావు, చిన్నారులు పాల్గొన్నారు.


పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ఆశ వర్కర్ల సమ్మె నోటీసు


చింతపల్లి: వైద్యాధికారికి వినతి పత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

చింతపల్లి, మే 6 ఆంధ్రజ్యోతి: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు సాగిన చిరంజీవి డిమాండ్ చేశారు. మంగళవారం లోతుగెడ్డ పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలు సమ్మె నోటీసు వైద్యాధికారి శివ ప్రసాద్‌కు అందజేశారు. ఈసందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు(సీహెచ్‌డబ్ల్యూ)లను ఆశ కార్యకర్తలకుగా మార్చు చేయాలన్నారు. లేబర్ కోడ్‌ను రద్దు చేయాలన్నారు. మే 20న జరగనున్న దేశ వ్యాప్త ఆశ వర్కర్ల సమ్మెను విజయవంతం చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. సీఐటీయూ నాయకులు మజ్జి రాంబాబు, సంఘ నాయకులు రాజేశ్వరి, రమణమ్మ పాల్గొన్నారు.

20న సమ్మె

డుంబ్రిగుడ: కార్మిక సమస్యలపై ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌బీ పోతురాజు కోరారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మె నోటీసును స్థానిక వైద్యాధికారి ఆశ కార్యకర్తలు అందజేశారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం కింద రూ. 20 వేలు ఆశ కార్యకర్తలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతగిరి: లేబర్ కోడ్స్ రద్దుచేయాలని కోరుతూ.. ఈనెల 20 తేదీన చేపట్టనున్న జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కిల్లో మోస్య తెలిపారు. మండలంలోని భీమవరం, లంగుపర్తి, అనంతగిరి పీహెచ్‌సీల వైద్యాధికారులకు సమ్మె నోటీసులను సీఐటీయూ నాయకులు అందజేశారు. ఆశ కార్యకర్తలు, తదితరులు సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోని జడ్పీటీసీ గంగరాజు, కొండలరావు, రమణ, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాల్లో సినీనటి ఇంద్రజ పూజలు



నటి ఇంద్రజకు చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ నిర్వాహకులు

అనకాపల్లి టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రముఖ సినీనటి ఇంద్రజ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. 'అనకాపల్లి' సినిమా షూటింగ్‌లో భాగంగా ఇక్కడికి విచ్చేసిన ఆమె గవరపాలెం సతకంపట్టులోని కనకదుర్గమ్మ, గౌరీపరమేశ్వరులు, మరిడిమాంబ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు అమ్మవారి చిత్రపటాలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో కనకదుర్గ ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు దంపతులు, ఆలయ అధ్యక్షులు భీమరశెట్టి వరహా నూకరాజు, గౌరీ పరమేశ్వరుల ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, పొలిమేర శ్రీను, గండేపల్లి మురళీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాలు



కల్యాణ పత్రికను ఆవిష్కరిస్తున్న భీమరశెట్టి రామకృష్ణ తదితరులు

అనకాపల్లి టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సుంకరమెట్ట జంక్షన్‌లో గల రమా సమేత సత్యనారాయణ దేవస్థానంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవం ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) మంగళవారం ఆవిష్కరించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళీ మాట్లాడుతూ బుధవారం ఉత్సవమూర్తులను మేళతాళాలతో పురవీధుల గుండా ఊరేగిస్తామన్నారు. ఎనిమిదో తేదీ గురువారం సాయంత్రం ఏకాదశి సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని కన్నుపండువగా నిర్వహించనున్నట్టు చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చదరం నాగేశ్వరరావు, మంగా ఈశ్వరరావు, కొణతాల మాధవ్, మారిశెట్టి భాస్కరరావు, శ్రీకాకుళం గణపతి, పెంటకోట చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కశింకోట గ్రామ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న టీడీపీ నేతలు

కశింకోట, మే 6 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కశింకోట టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కాయల మురళీ, తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా తాకాశి కృష్ణ, ప్రధాన కార్యదర్శి వేగి సాయి, ఉపాధ్యక్షుడి బత్తిన వీరభద్రరావు, కార్యదర్శులుగా వేగి సన్యాసిరావు, పెంటకోట జగన్నాథరావు, ట్రెజరర్‌గా కందాల సూర్య జగన్నాథరావు, గ్రామ తెలుగు యువత అధ్యక్షుడుగా కొయిలాడ నాగు, మహిళా అధ్యక్షురాలుగా కొంతం ఈశ్వరమ్మలను ఎన్నుకున్నారు. అనంతరం వీరిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపీ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, కాండ్రేగుల సతీష్, వేగి దొరబాబు, వేగి వెంకట్రావు, చెవ్వేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ కార్యాలయానికి ఇచ్చిన స్థలం రద్దు చేయాలి'

కొత్తూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జిల్లా కార్యాలయం నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన స్థలాలను వెనక్కి తీసుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. తుమ్మపాల రెవెన్యూ సర్వే నంబరు 608/1లో కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని మంగళవారం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు గంటా శ్రీరామ్, కమిటీ సభ్యులు వి.వి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు, అధికారుల బంగ్లాలకు స్థలాలు లేక అద్దె భవనాల్లో ఉన్నాయన్నారు. అలాగే, ఆటల కోసం మైదానాలకు తదితరాలకు స్థలాల కొరత ఉందన్నారు. వాటికోసం కేటాయింపులు చేయాల్సిన ప్రభుత్వ అధికారులు పార్టీ కార్యాలయం కోసం కేటాయించడం తగదన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

'ఆ స్థలం న్యాయ శాఖకు ఇవ్వండి'

అనకాపల్లి టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీకి ఇచ్చిన భూమి లీజును రద్దు చేసి, ఆ స్థలాన్ని న్యాయ శాఖకు అప్పగించాలని ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీఎస్ అజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. న్యాయస్థానాలు అద్దె భవనంలో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్నాయని వివరించారు. అనకాపల్లి జిల్లా కేంద్రంగా మారిన తరువాత కోర్టుల సంఖ్య పెరిగాయని, కోర్టు సముదాయానికి వచ్చే కక్షిదారులకు ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. అందువల్ల సదరు స్థలాన్ని న్యాయశాఖకు అప్పగిస్తే కోర్టుల సముదాయ భవనాన్ని నిర్మించడానికి అవకాశం ఉంటుందని వివరించారు.

'ఉపాధి'లో అవకతవకలపై విచారణ

- కశింకోటలో చేపట్టిన పనుల తీరుపై కలెక్టర్‌కు గ్రామస్థుల ఫిర్యాదు
- ఫీల్డ్ అసిస్టెంట్ తన కుటుంబ సభ్యులు ఎనిమిది మంది పేర్లతో మస్తర్లు వేశారని ఆరోపణ
- ఆ మేరకు పూర్తి వివరాలు సేకరించిన ఏపీడీ మణికుమార్, ఎంపీడీవో రవికుమార్



మండల పరిషత్ సమావేశ మందిరంలో విచారణ జరుపుతున్న ఏపీడీ, ఎంపీడీవో

కశింకోట, మే 5 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కశింకోటలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగాయని ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆమె స్పందించారు. ఈ మేరకు ఏపీడీ మణికుమార్, ఎంపీడీవో వి.వి.రవికుమార్‌లను విచారణ అధికారులుగా నియమించారు. పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఈ నెల మూడో తేదీ శనివారం విచారణ చేపట్టేందుకు వచ్చారు. ఫిర్యాదుదారులు అందుబాటులో లేకపోవడంతో విచారణను నేటికి వాయిదా వేశారు. ఈ క్రమంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్ బుద్ద దీపతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమె కుటుంబ సభ్యులైన ఎనిమిది మందిపై మంగళవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీవో మణికుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో సంబంధం లేని వారికి జాబ్‌కార్డులు మంజూరు చేసి, వారు పనులు చేయకుండానే మస్తర్లు వేసి లక్షలాది రూపాయలు నిధులు కాజేశారని ఫిర్యాదుదారులు ఆరోపించారన్నారు. దీప తన భర్త, ఆడపడుచు, మరిది, అత్త పేర్లతో మస్తర్లు వేసి మరీ అవకతవకలకు పాల్పడ్డారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. వీటన్నింటిపై విచారణ జరుగుతోందని సమగ్రమైన నివేదిక తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని ఆయన వివరించారు. ఈ విచారణ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

పల్లెల్లో అమ్మవార్ల వేడుకలు



సంతపాలెంలో పైడిమాంబ సన్నిధిలో భక్తులు



పూజలందుకున్న దుర్గమాంబ



ముత్యాలమ్మ

సబ్బవరం, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో దుర్గమాంబ వేడుకల్లో భాగంగా మంగళవారం అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి విశేష అలంకరణలు, పూజల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం మేళతాళాలు, తప్పెటగుళ్లు, కోలాటం, సాముగరిడీ, నేల డ్యాన్స్‌లు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం అనుపోత్సవం జరిపారు. ఏపీ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు, గండి బాబ్జీ కుమారుడు వంశీదీప్, వైసీపీ నాయకులు గండి రవికుమార్, నేతలు పీబీవీఎస్ఎన్ రాజు, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, బలిరెడ్డి అప్పారావు, బర్ల రమణ, పల్ల తాతారావు, కోరాడ శ్రీను, కొటాన రమణ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సంతపాలెంలో...

తుమ్మపాల : అనకాపల్లి మండలం సంతపాలెం పరిధిలో కొలువుదీరిన పైడిమాంబ పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఘటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ప్రముఖులు దర్శించుకున్నారు. గ్రామంలో మండలస్థాయి ఎడ్లపందేలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పరవాడలో...

పరవాడ : మండల కేంద్రం పరవాడలో గురువారం ముత్యాలమ్మ (బ్రాహ్మిణి) అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ భారీ ఎత్తున ఏర్పాట్లు చేపట్టింది. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆ రోజు ఉదయం ఐదు గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. రాత్రి ఏడు గంటల నుంచి పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

వెలుగు ఏపీఎంకు వీవోఏల సమ్మె నోటీసు



ఏపీఎం రంగారావుకు రంగారావుకు సమ్మె నోటీసు అందజేస్తున్న వీవోఏలు

పరవాడ, మే 6 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో డ్వాక్రా వీవోఏలు వెలుగు ఏపీఎం రంగారావుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు వీవోఏల మండల అధ్యక్షురాలు పైడిలక్ష్మి మాట్లాడుతూ వీవోఏల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, కనీస వేతనాల చట్టం అమలు చేయాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్న తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా వీవోఏలు రమాదేవి, ఉమా, వెంకటలక్ష్మి, విజయ, వరలక్ష్మి, నీలిమా, మణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై వేధింపులు తగవు



టిడ్కో గృహ సముదాయం ఎదుట ఆందోళన చేస్తున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ, మే 6 (ఆంధ్రజ్యోతి) : రావాడ పంచాయతీ పరిధి ధర్మారాయుడుపేట అంగన్‌వాడీ కార్యకర్త కె.ఉమాపై స్థానిక సర్పంచ్, ఐసీడీఎస్ సీడీపీవో వేధింపులకు పాల్పడడం మానుకోవాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక టిడ్కో గృహ సముదాయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ సర్పంచ్ రాజకీయ బెదిరింపులకు పాల్పడడం దారుణమన్నారు. రాజకీయ ఆధిపత్యం కోసం సర్పంచ్ అంగన్‌వాడీ కార్యకర్త ఉమాకు ఐసీడీఎస్ సీడీపీవో ద్వారా మెమో జారీ చేయించి సదరు మెమో కాపీను వాట్సాప్ గ్రూపుల్లో పెట్టి మానసికంగా వేధించడం తగదన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ఐద్వా ప్రతినిధులు వరలక్ష్మి, రత్నం, లక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్, పాఠ్య పుస్తకాలు సిద్ధం

- ఏడో తరగతి మినహా ఒకటి నుంచి పదో తరగతి వరకు చేరుకున్న పుస్తకాలు
- మొత్తం అన్నీ వచ్చాకే పంపిణీ ఆరంభం



కశింకోట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో భద్రపరిచిన పాఠ్య పుస్తకాలు

కశింకోట, మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలకు నోట్, పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయి. మండల వ్యాప్తంగా 55 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటికి నోట్ పుస్తకాలు 36,114, పాఠ్య పుస్తకాలు 17,907 చేరినట్టు ఎంఈవో -2 మూర్తి తెలిపారు. గత రెండు రోజులుగా పుస్తకాలను దిగుమతి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు మొత్తం పుస్తకాలన్నింటినీ ఒకేసారి పంపిణీ చేస్తామన్నారు. ఈ ఏడాది ఒకటి నుంచి పదో తరగతికి పుస్తకాలు రావాల్సి ఉండగా, వీటిలో 10వ తరగతికి సంబంధించి అన్ని సబ్జెక్టుల పుస్తకాలు వచ్చాయని వివరించారు. ఒక్క ఏడో తరగతికి తప్ప అన్ని తరగతులకు సబ్జెక్టుల వారీగా పుస్తకాలు వస్తున్నాయని చెప్పారు. ఆరో తరగతికి సంబంధించి తెలుగు, హిందీ, ఇంగ్లీషు కలిపి ఒక పుస్తకం ఉంటుందన్నారు. ఈ విధంగా అన్ని తరగతులకు రెండు లేదా మూడు సబ్జెక్టులు కలిపి పుస్తకాన్ని రూపొందించారని తెలిపారు. ఆరు, ఏడు తరగతులకు రెండొందల పేజీల వైట్ లాంగ్ పుస్తకాలు మూడు, రూల్ పుస్తకాలు నాలుగు, బ్రాడ్ రూల్స్ పుస్తకం ఒకటి చొప్పున ఎనిమిది నోట్ పుస్తకాలు అందజేయనున్నామన్నారు. అదనంగా కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు 201 పుస్తకాలు ఇప్పటికే చేరుకున్నాయన్నారు.

మూడు రకాల బ్యాగులు పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం మూడు రకాల బ్యాగులను ఈ ఏడాది అందజేయనుంది. ఒకటి నుంచి రెండో తరగతి విద్యార్థులకు చిన్న సైజు, మూడు నుంచి ఐదో వరకు మీడియం, ఆరు నుంచి పదో తరగతి వరకు మ్యాక్సిమం సైజు బ్యాగులు ఇవ్వనుంది. ఆరు నుంచి పది వరకు వరకు చదువుతున్న బాలురకి మాత్రమే బెల్టులు అందజేయనున్నారు. ఒకటి నుంచి ఐదు వరకు అందరికీ బెల్టు అందజేస్తారని వివరించారు. మొత్తం అన్ని పుస్తకాలు వచ్చేంత వరకు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పుస్తకాలు భద్రపరచడం జరిగిందని ఎంఈవో వివరించారు.

రెండు రోడ్ల మరమ్మతులకు రూ.2.96 కోట్లు మంజూరు



అధ్వానంగా ఉన్న గొటివాడ- అంతకాపల్లి రోడ్డు

సబ్బవరం, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంతకాపల్లి, నల్లరేగులపాలెం రోడ్ల మరమ్మతుకు నాబార్డు ద్వారా నిధులు మంజూరయ్యాయి. ఈ రోడ్లు అధ్వానంగా మారినా ఇన్నాళ్లు పట్టించుకునేవారు కరువయ్యారు. కూటమి అధికారంలోకి వచ్చాక మండలంలోని కొన్ని రోడ్లను బాగుచేయించింది. ఇప్పుడు రెండో విడతగా సబ్బవరం- చోడవరం రోడ్డు నుంచి గొటివాడ మీదగా అంతకాపల్లి, రావలమ్మపాలెం వరకూ 4.2 కిలోమీటర్లు మరమ్మతులు చేపట్టేందుకు రూ.1.8 కోట్లు, నల్లరేగులపాలెం నుంచి నారపాడు మీదగా నారపాడు జంక్షన్ వరకూ 2.3 కిలోమీటర్ల మేర మరమ్మతులకు రూ. 1.16 కోట్లు మంజూరు చేసినట్టు ఆర్అండ్‌బీ జేఈ బాలరాజు తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభం అవుతాయన్నారు.

20 వరకు 'అన్నదాత సుఖీభవ' నమోదుకు గడువు : ఏవో స్వప్న

కశింకోట, మే 6 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తూ అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రవేశపెట్టినట్టు మండల వ్యవసాయాధికారిణి ఎం.స్వప్న మంగళవారం తెలిపారు. ఈ పథకంలో చేరేందుకు రైతులు ఈ నెల 20వ తేదీలోగా వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. సొంత భూమి లేని కౌలు రైతులకు కూడా ఈ పథకం వర్తిస్తుందన్నారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు చేయించుకోవాలన్నారు. రూ.10వేలు పింఛన్ వచ్చేవారు ఈ పథకానికి అనర్హులుగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం కింద రూ.20 వేలను మూడు విడతల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని చెప్పారు. అటవీ భూములపై హక్కులు ఉన్న వారికి కూడా ఈ పథకం వర్తింపు ఉంటుందని వివరించారు. అర్హులంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

వీధి కుక్కల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్



కుక్కలు పట్టుకుంటున్న సిబ్బంది

అనకాపల్లి టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ శానిటేషన్ విభాగం అధికారులు కుక్కల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఉదయం, సాయంత్రం పట్టణంలో కనిపించిన కుక్కలను పట్టుకొని విశాఖకు తరలించి, పిల్లలు పుట్టకుండా ఆపరేషన్లు చేయించనున్నామని శానిటేషన్ విభాగం సూపర్‌వైజర్ రవికుమార్ తెలిపారు. కొద్ది రోజులు తరువాత పట్టుకున్న కుక్కలను మరలా అదే ప్రదేశాల్లో విడిచిపెడతామని చెబుతున్నారు. ఇటీవల కాలంలో అనకాపల్లిలో కుక్కల బెడద అధికం కావడం, పలువురిపై దాడి చేయడంతో అధికారులు స్పందించి ఈ చర్యలు చేపట్టారు.

వైసీపీ జిల్లా కార్యదర్శిగా రాపేటి రాము

సబ్బవరం, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారపాడు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు రాపేటి రాము ఆ పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు అందాయని ఆయన తెలిపారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే ఉన్నారు. ఆయన భార్య అరుణ ఎంపీటీసీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు.

కొనసాగుతున్న సీహెచ్‌వోల దీక్ష

కొత్తూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలోని స్టేట్ బ్యాంకు వద్ద గత ఎనిమిది రోజులుగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సమస్యలపై దీక్షలు చేపడుతున్నారు. మంగళవారం వీరికి బహుజన్ సమాజ్ పార్టీ మంగళవారం మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జి నూదికొండ మాణిక్యాలరావు మాట్లాడుతూ అరకొర జీతాలతో ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న వీరి సమస్యలపై నిర్లక్ష్యం చూపడం తగదన్నారు.

తుక్కు దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

- పెద్దఎత్తున ఎగసిపడుతున్న మంటలు
- రాత్రి 11 గంటల వరకు అదుపుచేసే పనిలో అగ్నిమాపక సిబ్బంది



మంటలను అదుపుచేస్తున్న సిబ్బంది

పరవాడ, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం జంక్షన్ నుంచి ఫార్మాసిటీకి వెళ్లే రహదారి బ్యాంక్ కాలనీ వద్ద తుక్కు దుకాణంలో మంగళవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడుతున్నాయి. ఇందుకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి. మంగళవారం మధ్యాహ్నం సుమారు ఒంటిగంటన్నర సమయంలో తుక్కు దుకాణం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో పెద్ద ఎత్తున గాలులు వీయడంతో క్షణాల్లోనే మంటలు పరిసర ప్రాంతాలకు వ్యాపించాయి. దుకాణంలో ఉన్న చెక్క బాక్సులు, ఇతర సామగ్రి మంటల్లో చిక్కుకున్నాయి. అలాగే సమీపంలో ఉన్న తాటిచెట్లు కూడా కాలిపోయాయి. దుకాణానికి సమీపంలో ఉన్న హెచ్‌టీ విద్యుత్ లైన్‌తీగ తెగి పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో సమీపంలో ఎండిపోయిన ముళ్ల పొదలు అంటుకున్నాయి. ఆ పక్కనే ఉన్న తుక్కు దుకాణంలో చెక్క బాక్సులకు వ్యాపించడంతో భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి. రాంకీ, లారస్, అనకాపల్లి, గాజువాక, సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన అగ్నిమాపక శకటాలు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసే పనిలో నిమగ్నమయ్యాయి. విషయం తెలుసుకున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ ఆర్.మల్లికార్జునరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు.



దుకాణంలో భారీగా ఎగసిపడుతున్న మంటలు

ఇక్కడ ప్రమాదం జరగడం ఇది రెండోసారి

ఈ తుక్కు దుకాణంలో అగ్నిప్రమాదం గతంలో కూడా ఒకసారి చోటు చేసుకుంది. అప్పట్లో సుమారు 24 గంటలు పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. అయితే ఖాళీ ప్రదేశంలో ఎక్కువ మొత్తంలో తుక్కును పడేయడంతో పాటు ప్రమాదం జరిగితే కనీస నివారణ చర్యలు తీసుకోవడానికి అక్కడ ఎలాంటి భద్రత ఏర్పాట్లు చేపట్టలేదు. అలాగే దుకాణం యజమానికి అగ్నిమాపక, రెవెన్యూశాఖల నుంచి అనుమతులు లేనట్టు అధికారులు గుర్తించారు. ఇదిలావుంటే అగ్నిమాపక సిబ్బంది రాత్రి పదకొండు గంటల వరకు మంటలు అదుపు చేసే పనిని నిమగ్నమయ్యారు. తుక్కు దుకాణంలో ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ తుక్కు దుకాణంలో రెండోసారి ప్రమాదం జరిగిందని, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న దుకాణ యజమాని పై చర్యలు తీసుకోవాలన్నారు.


లంకెలపాలెం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సందడి



పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

లంకెలపాలెం, మే 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా మంగళవారం కలుసుకున్నారు. దాదాపు రెండున్నర దశాబ్దాల అనంతరం కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధులు లేవు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఎవరెవరు ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో తెలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను కాసేపు జ్ఞప్తికి తెచ్చుకున్నారు. సహపంక్తి భోజనాల అనంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు గొంతిన నరసింగరావు, సాలాపు సత్తిబాబు, శ్రీనివాసరావు, సంతోశ్ కుమార్, అల్లం అదిత్య, భాస్కర్, వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బ్రిటిష్ పాలనపై విప్లవాగ్ని

సాయుధ పోరాటంతో గడగడలాడించిన విప్లవ వీరుడు

- ఆదివాసీలపై అకృత్యాలను అడ్డుకున్న మన్యం ధీరుడు
- గిరిజనులతో కలిసి తిరుగుబాటుకు శ్రీకారం
- నేడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి

చింతపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి):

బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు సాయుధ పోరాటంతో స్వాతంత్ర్య ఉద్యమంలో ఓ చరిత్ర సృష్టించారు. పిన్నవయసులోనే బ్రిటిష్ పాలకుల అకృత్యాలు, దురాగతాలను ఎదిరించిన ధీరోధాత్తుడు. గిరిజనాన్ని ఏకం చేసి రంప తిరుగుబాటుకు శ్రీకారం చుట్టిన సీతారామరాజు రెండేళ్ల పోరాటంలో నాటి పాలకులకు కంటిమీద కునుకులేకుండా చేశాడు. సీతామరాజు పోరాటం లండన్‌లోని బ్రిటిష్ ప్రభుత్వాన్ని సైతం కదిలించింది. అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి' కథనం.

అల్లూరి సీతారామరాజు అసలు పేరు శ్రీరామరాజు. ఉమ్మడి విశాఖ జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగిలోని అమ్మమ్మ ఇంట జన్మించాడు. శ్రీరామరాజు తండ్రి అల్లూరి వెంకటరామ రాజుది పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లు. ఆయన గ్రామంలో ఫొటో స్టూడియో నడిపేవారు. 1890లో అనకాపల్లి వచ్చి కొంతకాలం ఉన్నారు. అదే సమయంలో విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం కొండవెలగాడ నుంచి బతుకుతెరువు కోసం పద్మనాభం మండలం పాండ్రంగికి వలస వచ్చిన వెంకటరామరాజు (శ్రీరామరాజు తాత) కుమార్తె సూర్యనారాయణమ్మతో వివాహం కుదిరింది. అల్లూరి వెంకటరామ రాజు, సూర్యనారాయణమ్మల వివాహం 1895లో జరిగింది. మొదటి కాన్పు కోసం సూర్యనారాయణమ్మ 1896 చివరిలో పుట్టింటికి రాగా, 1897 జూలై 4న సాయంత్రం 4:10 గంటలకు శ్రీరామరాజు (సీతారామరాజు) జన్మించాడు. అతడికి ఏడాది వయసు వచ్చాక వెంకటరామరాజు, సూర్యనారాయణమ్మ దంపతులు స్వగ్రామం మోగల్లు వెళ్లిపోయారు. వీరికి 1901లో కూమార్తె సీతమ్మ, 1906లో రెండో కుమారుడు సూర్యనారాయణరాజు జన్మించారు.



కృష్ణాదేవిపేటలో సీతారామరాజు, గంటం దొర సమాధులు

పిన్నవయసులో తండ్రిని కోల్పోయి

సీతారామరాజు తండ్రి రామరాజు రాజమండ్రిలో ఫొటో గ్రాఫర్‌గా పేరు తెచ్చుకున్నారు. అయితే 1908లో గోదావరి పుష్కరాల సందర్భంగా ప్రబలిన కలరా వ్యాధి కి గురై మరణించారు. శ్రీరామరాజు ఆరో తరగతిలో ఉండగానే తండ్రిని కోల్పోవడంతో స్థిరాదాయంలేక, వివిధ ప్రదేశాలకు వెళ్లి నివసించాల్సి వచ్చింది. తండ్రి మరణం అతడి విద్యాభ్యాసంపై తీవ్ర ప్రభావం చూపింది.



అల్లూరి సీతారామరాజు దాడిచేసిన చింతపల్లి పోలీసు స్టేషన్

తొలి స్థావరం కృష్ణాదేవిపేట..

సీతారామరాజుకు కృష్ణాదేవిపేటలోని చిటికెల భాస్కరనాయుడు ఆశ్రయం కల్పించారు. 1917లో స్నేహితుడు పేరిచర్ల సూర్యనారాయణతో కలిసి కాషాయ వస్త్రాలు ధరించి కృష్ణాదేవిపేట నీలకంఠేశ్వరుని ఆలయంలో మకాం పెట్టారు. ఆదివాసీలపై బ్రిటిష్ పాలకుల దురాగతాలు, అకృత్యాలను సహించలేక వారిపై పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాడు.

కూలి చెల్లింపుల్లో అన్యాయంపై లేఖ

లంబసింగి ఘాట్ రోడ్డు నిర్మాణంలో పనిచేస్తున్న గిరిజనులకు చింతపల్లి తహసీల్దార్ బాస్టియన్ తక్కువ కూలి చెల్లించడంపై బ్రిటిష్ పాలకులకు సీతారామరాజు లేఖరాశాడు. చింతపల్లి తహసీల్దార్ బాస్టియన్ అత్యంత క్రూరుడు. నర్సీపట్నం నుంచి లంబసింగి వరకు రోడ్డు నిర్మించే కాంట్రాక్టరుతో కుమ్మక్కై గిరిజనులకు ఆరు అణాలకు బదులుగా రెండు అణాలు మాత్రమే చెల్లించేవాడు. ప్రశ్నించిన వారిని కొరడాలతో కొట్టించేవాడు. ఫిర్యాదు చేసినా బ్రిటిష్ పాలకులు పట్టించుకోలేదు. సీతారామరాజు గిరిజనులను కూడగట్టి విప్లవం రగిలిస్తున్నాడని బాస్టియర్ ప్రభుత్వానికి లేఖరాశాడు. దీంతో సీతారామరాజు కదలికలపై అడ్డతీగల సమీప పైడిపుట్టి, నర్సీపట్నం అధికారులు ఆరా తీసేవారు. ఆ సమయంలో ప్రభుత్వ ఉద్యోగి ఫజులుల్లాఖాన్ సీతారామరాజుకు సహాయం చేసేవాడు. దీంతో తిరుగుబాటు చేయనని అతనికి అల్లూరి మాట ఇచ్చాడు. 1922 జూలై 27న ఫజులుల్లాఖాన్ ఆకస్మికంగా మరణించాడు. దీంతో సీతారామరాజు ఉద్యమానికి శ్రీకారంచుట్టాడు. గిరిజన ప్రాంతంలో అడుగుపెట్టి గంటందొర, మల్లుదొర, మొట్టడం వీరయ్యదొర, కంకిపాటి ఎండు పడాల్, సత్యనారాయణ రాజు, అగ్గిరాజు, గోకిరి ఎర్రేసుతో సహా 150మంది గిరిజనులను బ్రిటిష్ పాలకులపై పోరాటానికి సిద్ధం చేశాడు. 1922 ఆగస్టు 19న మహారుద్రాభిషేకం చేసి చింతపల్లి పోలీసు స్టేషన్‌పై దాడికి నిర్ణయించాడు.



లంబసింగి ఘాట్ నిర్మాణంలో బ్రిటిష్ పాలకుల శిలాఫలకం

ప్రారంభమైన సాయుధ పోరాటం

అల్లూరి అనుచరులతో తొలిసారిగా 1922 ఆగస్టు 22న చింతపల్లిపై దాడి చేసి సాయుధ పోరాటానికి నాంది పలికాడు. స్టేషన్‌లో 11 తుపాకులు, ఐదు కత్తులు, 1,390 తుపాకీ గుళ్లు, 11 బాయనెట్లు స్వాధీనం చేసుకున్నారు. వాటి వివరాలను రికార్డులో నమోదు చేశాడు. అదే క్రమంలో 23న కృష్ణాదేవిపేట, 24న రాజవొమ్మంగి పోలీసు స్టేషన్‌లపై దాడిచేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాడు. రాజవొమ్మంగి స్టేషన్‌లో బందీగా ఉన్న వీరయ్యదొరను విడిపించాడు. బ్రిటిష్ పాలకులకు ముందస్తు సమాచారం ఇచ్చి మరీ సీతారామరాజు సాహసోపేతంగా అక్టోబరు 15న అడ్డతీగల పోలీసు స్టేషన్‌పై దాడిచేశాడు. అదేనెల 19న రంపచోడవరం పోలీసు స్టేషన్‌ని పట్టపగలే ముట్టడించి, మొదటి దశ విప్లవానికి శ్రీకారం చుట్టారు. అదే ఏడాది డిసెంబరు 6నుంచి రెండో దశ ఉద్యమాన్ని ప్రారంభించిన సీతారామరాజు బ్రిటిష్ పాలకులను ముప్పుతిప్పలు పెట్టాడు.

రూథర్‌ఫర్డ్ రాకతో...

ఉద్యమాన్ని అణచివేసేందుకు 1924 ఏప్రిల్ 17 మన్యానికి రూథర్‌ఫర్డ్ కలెక్టర్‌గా వచ్చాడు. కృష్ణాదేవిపేటలో సభను ఏర్పాటుచేసి వారం రోజుల్లో విప్లవకారుల ఆచూకీ తెలియకపోతే ప్రజలను కాల్చివేస్తామని హెచ్చరించాడు. విషయం తెలుసుకున్న సీతారామరాజు మే 7న పశువుల కాపరి ద్వారా తానున్న ప్రాంతాన్ని పోలీసులకు చేరవేసి మంప చెరువులో స్నానంచేస్తూ పట్టుబడ్డాడు. ఎటువంటి విచారణ లేకుండా అల్లూరి సీతారామరాజును కొయ్యూరులోని చింత చెట్టుకు కట్టి గుడాల్ కాల్చిచంపాడు. ఆ మరుసటి రోజున రాజు మృతదేహాన్ని ఫొటో తీయించి, కృష్ణాదేవిపేటలో దహనం చేశాడు.



అల్లూరి దాడి చేసిన పోలీసు స్టేషన్ వద్ద సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి (ఫైల్)





పాండ్రంగిలో అల్లూరి సీతారామరాజు జన్మించిన గృహం (ఫైల్). (ఇన్‌సెట్‌లో) చిన్న వయసులో సీతారామరాజు(ఫైల్)

క్రైం... crime news

విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి

కశింకోట, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగబిల్లిలో వ్యవసాయ బోరు వద్ద విద్యుత్ షాక్‌కు గురై మహిళా రైతు మృతిచెందింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా వున్నాయి. గ్రామానికి చెందిన చవితిన చెల్లయ్యమ్మ (54) మంగళవారం ఉదయం కుమారుడు రమణబాబుతో కలిసి పొలంలో నువ్వులు చల్లడానికి వెళ్లారు. ఇంటి వద్ద నుంచి వచ్చేటప్పుడు తెచ్చుకున్న మంచినీరు అయిపోవడంతో నీటి కోసం ఆమె వ్యవసాయ విద్యుత్ బోరు వద్దకు వెళ్లింది. స్విచ్ ఆన్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై గిలగిలకొట్టుకుంటున్నది. సమీపంలో వున్న కుమారుడు వెంటనే కర్ర తీసుకుని విద్యుత్ బోర్డును నేల కూల్చి, తల్లిని కాపాడే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే ఆమె మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



చవితిన చెల్లయ్యమ్మ (ఫైల్‌ఫొటో)

రైలు ఢీకొని మహిళ మృతి

పాయకరావుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): తాను ఎక్కాల్సిన రైలు కాకుండా మరో రైలు ఎక్కిన మహిళ.. కొంతదూరం ప్రయాణించిన తరువాత ఈ విషయాన్ని గమనించింది. తరువాత రైలు ఆగిన స్టేషన్‌లో దిగింది. అవతల వైపు ప్లాట్‌ఫారంపైకి వెళ్లడానికి పట్టాలు దాటుతుండగా, మరో రైలు ఢీకొన్నది. నర్సీపట్నం రోడ్ స్టేషన్‌లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం తోటవలస గ్రామానికి చెందిన సాలూరు సంతోషి(37) వైద్య పరీక్షల కోసం సోమవారం విశాఖపట్నం కేజీహెచ్‌కు వచ్చింది. ఇక్కడ పని పూర్తయిన తరువాత రైలులో సొంతూరు వెళ్లేందుకు రాత్రి ఏడున్నర గంటలకు విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కు వెళ్లింది.

ఈ సమయంలో ప్లాట్ ఫారాలపై రాయగడ -గుంటూరు ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-రాయగడ పాసింజర్ రైళ్లు వున్నాయి. రాయగడ వెళ్లే రైలు ఎక్కాల్సిన ఆమె పొరపాటున గుంటూరు వెళ్లే రాయగడ ఎక్స్‌ప్రెస్ ఎక్కింది. రాత్రి కావడంతో చాలాసేపటి వరకు ఆమెకు ఈ విషయం తెలియదు. ఎలమంచిలి దాటిన తరువాత ఈ విషయాన్ని గమనించిన సంతోషి, తరువాత రైలు ఆగిన నర్సీపట్నం రోడ్ స్టేషన్‌లో దిగిపోయింది. తిరిగి విశాఖ రావడానికి రెండో నంబరు ప్లాట్‌ఫారంపైకి వెళ్లేందుకు పట్టాలు దాటుతున్నది. ఇదే సమయంలో వస్తున్న మరో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న తుని రైల్వే పోలీసులు మంగళవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి వద్ద వున్న ఆధారాలతో ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నిందితులకు జరిమానా, రిమాండ్

ఎలమంచిలి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత పది రోజుల వ్యవధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుపడిన 37 మందిని మంగళవారం కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వీరిలో 32 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున న్యాయమూర్తి జరిమానాలు విధించారని, మిగిలిన ఐదుగురికి నాలుగు రోజులపాటు జ్యూడీషియల్ రిమాండ్ విధించారని చెప్పారు.

40 కిలోల గంజాయితో నలుగురి అరెస్టు

కోటవురట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల పోలీసులు 40 కిలోల గంజాయితో నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. దీనికి సంబంధించి నక్కపల్లి సీఐ రామకృష్ణ అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటవురట్ల మండలం యండపల్లి జంక్షన్‌సమీపంలో పోలీసులు మంగళవారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో నర్సీపట్నం వైపు నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా.. డిక్కీలో గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న నలుగురుని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వీరు ఉత్తరప్రదేశ్‌కు చెందిన షెహన్‌వాజ్, షాబాద్, రుక్సానా, చింతపల్లి మండలం బెన్నవరం గ్రామానికిచెందిన రాజుబాబుగా గుర్తించారు. గంజాయిని తూకం వేసి 40 కిలోలు వున్నట్టు నిర్ధారించారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమేశ్ తెలిపారు.

ప్రైవేటుకు దీటుగా..

... 5వ పేజీ తరువాయి

పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు సాధించిన మార్కులు, ఉత్తీర్ణత శాతం, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరిస్తున్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను వెంటబెట్టుకుని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. వారి ప్రతిభ అందరికీ తెలిసేలా బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న వారిలో 5,080 మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్పించారు. 5వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు 6వ తరగతిలో ప్రైవేటు పాఠశాలల్లో చేరకుండా ఇప్పటికే 10,800 మందిని పభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చేర్పించారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే వరకు ఈ డ్రైవ్ కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.

రూ.3 కోట్ల డీల్!?

... 5వ పేజీ తరువాయి

చేసుకోలేదు. అయినా అనకాపల్లి జిల్లా ఎస్ఈ సిఫారసు చేశారని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం పెరిగిన జీతాలు ఇచ్చేసింది. ఇక్కడ అత్యంత కీలకమైన అధికారి ఒకరు ఉన్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్. ఆమె ఆర్ఈసీఎస్‌కు పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. సొసైటీ ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నా ఆమె ఆమోదించాలి. అలాగే ఎస్ఈ ఇన్‌చార్జి ఎండీగా వ్యవహరిస్తున్నారు. ఆయన కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. గతంలో ఎండీ అక్రమాలకు పాల్పడినందునే ఆయన్ను సస్పెండ్ చేశారు. గతంలో సొసైటీ పాలకమండలి పీఆర్‌సీకి ఏ విధంగా తీర్మానం చేసేదో అలాగే తామూ చేసి జీతాలు పెంచామని ఆ జిల్లా అధికారులు చెబుతున్నారు. పాలక మండలి ఇప్పుడు లేదు. ఇవి ఆర్థిక వ్యవహారాలు. ప్రభుత్వ ఆమోదం ఉండాలి. ఒకవేళ పీఆర్‌సీ ఇవ్వాలనుకుంటే సహకార శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాలి. అక్కడి నుంచి వచ్చే నిర్ణయానికి కట్టుబడి ఉండాలి. సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 నుంచి 62 ఏళ్లకు పెంచడం కుదరదని కమిషనర్ చెబితే అంతా మిన్నకున్నారు. ఇప్పుడు కూడా అలాగే కమిషనర్ నిర్ణయం కోరాల్సి ఉంది. కానీ అటువంటిదేమీ లేకుండానే రాజకీయ ఒత్తిళ్లకు లొంగి పీఆర్‌సీ వర్తింపజేసేశారు. దీనిపై విజిలెన్స్, ఏసీబీ విచారణ చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.

నాడు అధ్వానంగా.. నేడు అద్దంలా..

... 5వ పేజీ తరువాయి

తలపించేవి. రోడ్డు అభివృద్ధి కోసం టెండర్లు నిర్వహించి, శంకుస్థాపన కూడా చేశారు. కానీ పనులు మాత్రం మొదలు పెట్టలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ఉపాధి హామీ పథకం, పంచాయతీ నిధులు రూ.2.5 కోట్లు మంజూరు చేయించారు. చోడవరం నుంచి పీఎస్‌పేట వరకు రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. రోడ్డుకు ఇరువైపులా సీసీ కాలువలు నిర్మించారు. ఇటీవల రోడ్డు నిర్మాణ పనులు పూర్తికావడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకుంటున్నారు. గుంతలు లేని రోడ్డుపై సాఫీగా ప్రయాణిస్తున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

గర్భస్థ శిశు లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- డీఆర్‌ఓ వై.సత్యనారాయణరావు



జిల్లాస్థాయి కమిటీతో సమావేశమైన డీఆర్‌ఓ సత్యనారాయణరావు

తుమ్మపాల, మే 6 (ఆంధ్రజ్యోతి) : గర్భస్థ శిశు లింగనిర్ధారణ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓ వై.సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. గర్భస్థ శిశు లింగనిర్ధారణ చట్టంపై మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కమిటీతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం లింగ నిష్పత్తి వెయ్యి మంది బాలురు, 972 మంది బాలికలుగా ఉందని చెప్పారు. లింగ నిష్పత్తి అంతరం అధికంగా ఉన్న మండలాల్లో సీడీపీవోలు మరింత సమర్థంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఆడ శిశువులు, బాలికలను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. స్కానింగ్ కేంద్రాలు, ల్యాబ్‌లపై నిఘా పెట్టాలని, గర్భస్థ శిశు లింగ వివరాలను బహిర్గతం చేసేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడ శిశువు అని తెలిసి గర్భస్రావం చేయిస్తున్నట్టు సమాచారం అందితు వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 102, 104లకు తెలియపరచాలని చెప్పారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి శాంతిప్రభ మాట్లాడుతూ, తమ శాఖ ద్వారా బాలికల సంరక్షణపై విస్తృత ప్రచారాన్ని చేపడుతున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ మోహనరావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ అనంతలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు బాలాజీ, కేవీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కేసుల విచారణలో ఫోరెన్సిక్ ఆధారాలు కీలకం

- రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

అనకాపల్లి టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): నేర విచారణలో ఫోరెన్సిక్ ఆధారాల పాత్ర కీలకమని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నేరాల దర్యాప్తులో ఆధునిక శాస్త్రీయ విధానాలపై మంగళవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫోరెన్సిక్ నిపుణులు చెప్పిన విషయాలను అవగతం చేసుకొని కేసుల విచారణను మరింత వేగవంతం చేయాలని అన్నారు. నేరాల విషయంలో బాధితులకు న్యాయం జరగాలంటే దర్యాప్తు అధికారులు, ఫోరెన్సిక్ వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ, ఈ శిక్షణ కార్యక్రమం కేసుల దర్యాప్తులో స్పష్టతను పెంచడానికి దోహదపడుతుందన్నారు. ఈ వర్క్‌షాపులో నార్కోటిక్, మత్తు పదార్థాలు, విష పదార్థాలు, డిజిటల్ ఆధారాలు, సైబర్ నేరాల పరికరాలు, ఆడియో/ వీడియో ఫుటేజీ, డీఎన్ఏ, రక్తనమూనాలు, మానవ అవయవాలు వంటి ఆధారాల సేకరణ, ప్యాకింగ్, భద్రపరిచే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఆర్ఎఫ్ఎస్ఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.నాగరాజు, శాస్త్రీయ సహాయకులు ఎం.రాంబాబు, పీపీఎస్‌డీ చలపతి, ఇ.కిరణ్‌కుమార్ శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు ఎం.శ్రావణి, పి.శ్రీనివాసరావు, వి.విష్ణుస్వరూప్, ఫోరెన్సిక్ వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది



మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి. పక్కన ఎస్పీ తుహిన్ సిన్హా

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో గణేశ్ ప్రతిభ

- జాతీయ జట్టుకు ఎంపిక

రావికమతం, మే 6(ఆంధ్రజ్యోతి): విజయవాడ సమీపంలోని హిల్ పారడైజ్ పాఠశాలలో ఈ నెల 4, 5 తేదీల్లో ఏపీ సమగ్ర శిక్ష, స్పెషల్ ఒలింపిక్ భారత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మనో వైకల్య బాలల రాష్ట్ర స్థాయి ఒలింపిక్స్-2025 వాలీబాల్ పోటీల్లో మండలంలోని కొమిర గ్రామానికి చెందిన అప్పికొండ గణేశ్ ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. జూన్ 14న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో గణేశ్ రాష్ట్ర జట్టు తరపున ఆడతాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో అనకాపల్లి జిల్లా జట్టు తరపున గణేశ్ పాల్గొన్నాడు. ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడంతో పాటు జాతీయ జట్టుకు ఎంపికైన గణేశ్‌ను భవిత కేంద్రం ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు, గ్రామస్థులు అభినందించారు.



బంగారు పతకంతో గణేశ్

టీడీపీ కార్యాలయానికి రెండు ఎకరాలు కేటాయింపు

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

అనకాపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జిల్లా పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి పట్టణంలో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ జిల్లా కార్యాలయం నిర్మాణం కోసం భూమి కేటాయించాలంటూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు గత ఏడాది జూలై 22న కలెక్టర్ విజయకృష్ణన్‌కు దరఖాస్తు చేశారు. దీనిని పరిశీలించిన కలెక్టర్.. అనకాపల్లి మండలం తుమ్మపాల రెవెన్యూ పరిధి సర్వే నంబరు 608/1లో రెండు ఎకరాలను కేటాయించారు. ఎకరాకు ఏడాదికి రూ.1,000 అద్దె చొప్పున 33 సంవత్సరాల పాటు లీజుకు ఇస్తూ గత నెల 28న ఉత్తర్వులు జారీ చేశారు. కాగా జిల్లాలో అనేక ప్రభుత్వ కార్యాలయాలకు సొంత గూడు లేక అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, ఇటువంటి పరిస్థితుల్లో టీడీపీ జిల్లా కార్యాలయానికి ప్రభుత్వ భూమి కేటాయించడం ఏమిటంటూ ప్రజా సంఘాల నాయకులు తప్పుబడుతున్నారు. కాగా టీడీపీ కార్యాలయానికి భూమి కేటాయింపుపై అనకాపల్లి తహసీల్దారు విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా, ప్రభుత్వ జీవో ప్రకారమే భూమి కేటాయింపు జరిగిందని, ఇందులో నిబంధనల ఉల్లంఘన జరగలేదన్నారు.



అనకాపల్లి మండలం తుమ్మపాల రెవెన్యూ పరిధిలో టీడీపీ కార్యాలయానికి కేటాయించిన స్థలం

కిరండోల్ రైలు దంతెవాడ వరకే..

విశాఖపట్నం, మే 6 (ఆంధ్రజ్యోతి) : జగదల్‌పూర్, కిరండోల్ మధ్య భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ, కిరండోల్ మధ్య నడిచే రైళ్ల గమ్యాలను కుదించి విశాఖ- దంతెవాడ మధ్య రాకపోకలు సాగించేలా చర్యలు చేపడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ- కిరండోల్ పాసింజర్ (58501), విశాఖ- కిరండోల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18515) రైళ్లు ఈ నెల 8వ తేదీ నుంచి 15 వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండోల్- విశాఖ పాసింజర్ (58502), కిరండోల్- విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18516) రైళ్లు ఈనెల 9 నుంచి 16వ తేదీ వరకు విశాఖ-దంతెవాడ మధ్య నడుస్తాయని పేర్కొన్నారు. దంతెవాడ-కిరండోల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామని వివరించారు.

10 నుంచి బ్రహ్మపూర్ పాసింజర్ సర్వీసులు రద్దు

విశాఖపట్నం, మే 6 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని దూసి, పొం దూరు సెక్షన్‌లో పవర్ బ్లాక్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ- బ్రహ్మపూర్ మధ్య నడిచే పాసింజర్ రైళ్ల సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 10 నుంచి జూన్ 14 వరకు విశాఖ- బ్రహ్మపూర్ పాసింజర్ (58532), ఈనెల 11 నుంచి జూన్ 15 వరకు బ్రహ్మపూర్-విశాఖ పాసింజర్ (58531) రైళ్ల సర్వీసులు రద్దు చేశామని పేర్కొన్నారు